సోనియా పోటీపై సర్వత్రా ఆసక్తి




- ఖమ్మం అభ్యర్థిత్వంపై రాజకీయ చర్చ
- కలవరపడుతున్న విపక్షాలు!
- చర్చనీయాంశమైన 'ఆంధ్రజ్యోతి' కథనం

ఖమ్మం, జనవరి 5(ఆంధ్రజ్యోతిప్రతినిధి):లోక్‌సభ ఎన్నికల సమయం సమీపిస్తున్న నేపథ్యంలో.. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ బరిలో నిలబోతున్నారన్న వార్త సర్వత్రా ఆసక్తిని రేపింది. సోనియా ఖమ్మం నుంచి పార్లమెంట్‌కు పోటీ చేయబోతున్నారని, ఆదిశగా అధిష్ఠానం పరిశీలన చేస్తోందని, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు పలువురు రాష్ట్ర నేతలు సోనియా పోటీకి ప్రతిపాదన చేశారంటూ శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ముఖ్యంగా అధికార కాంగ్రెస్‌లో మరింత ఉత్సాహాన్ని నింపగా.. విపక్షాల్లో మాత్రం కలవరం మొదలైంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్, సీపీఐ కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీలతో విజయం సాధించారు. దీంతో ఈ నియోజకవర్గంలో ఎవరి పోటీ చేసినా గెలుపుసు నాయాసమే నన్న అంచనాలున్నాయి. ఈ నేపథ్యంలో సోనియాగాంధీని ఖమ్మంలోక్‌సభ బరిలో నిలపడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పార్టీలో మరింత ఉత్తేజం వస్తుందని భావిస్తున్నారు. ఈ ప్రతిపాదనకు సోనియా కూడా సుముఖత వ్యక్తం చేశారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఖమ్మంలో ఆమె పోటీ ద్వారా దక్షిణాది రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు మరింత జోష్ పెరుగుతుందని, ఎక్కువ లోక్‌సభ స్థానాల్లో పాగా వేయొచ్చని కాంగ్రెస్ అధినాయకత్వం వ్యూహరచన చేస్తోంది.



తొలినుంచి కాంగ్రెస్‌కు కంచుకోట..

ఆది నుంచి ఖమ్మం కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉంటుండగా.. ఈనియోజకవర్గంనుంచి లక్ష్మీ కాంతమ్మ, జలగం వెంగళరావు, రంగయ్యనాయుడు, నాదెండ్ల భాస్కరరావు, రేణుకాచౌదరి కాంగ్రెస్ నుంచి ఎంపీలుగా గెలుపొందారు. ఇక ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మంలోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఖమ్మం, మధిర, పాలేరు, వైరా, సత్తుపల్లి, కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాలుండగా.. ఆరు చోట్ల కాంగ్రెస్ గెలవగా.. కొత్తగూడెంలో తన మిత్రపక్షమైన సీపీఐ అభ్యర్థి గెలుపొందారు. అలాగే డిప్యూటీ సీఎంగా ఉన్న భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముగ్గురూ ఈ నియోజకవర్గం నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీనికి తోడు పార్లమెంట్ ఎన్నికల్లోనూ సీపీఐ కాంగ్రెస్ దోస్తీ కొనసాగే అవకాశం కనిపిస్తుండగా.. ఖమ్మంలోక్‌సభ స్థానంలో కాంగ్రెస్‌కు అత్యధిక మెజారిటీ వస్తుందని అధినాయకత్వం అంచనా వేసుకుంటోంది. సోనియ ఖమ్మం నుంచి పోటీ చేస్తే ప్రచార బాధ్యతంతా మంత్రులు, నేతలు సులభంగా చూసుకునే అవకాశం ఉండటంకూడా వారికి కలిసొస్తుందని భావిస్తున్నారు.



భారీగానే ఆశావహుల సంఖ్య..

వాస్తవానికి ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీకి ఆసక్తిచూపుతున్న వారి సంఖ్య భారీగా ఉందన్న చర్చ జరుగుతోంది. మరోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసేందుకు కేంద్రమాజీమంత్రి రేణుకాచౌదరి సన్నాహాలు చేసుకుంటున్నారు. ఆమెతో పాటు పలువురు ముఖ్యనేతలు ఎవరికివారు అధిష్ఠానం వద్ద ప్రయత్నాలు చేసుకుంటున్నారు. అయితే సోనియాగాంధీ ఖమ్మంనుంచి బరిలో దిగితే రేణుకాచౌదరికి రాజ్యసభ సీటు కేటాయించే అవకాశాలున్నాయని కాంగ్రెస్‌వర్గాలు చెబుతున్నాయి.

విపక్షాల్లో మొదలైన కలవరం

సోనియాగాంధీ ఖమ్మం నుంచి పోటీచేస్తారన్న ప్రచారంతో విపక్షపార్టీల్లో కలవరం మొదలైనట్టు కనిపిస్తోంది. అసలే అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరపరాజయంతో ఉన్న బీఆర్ఎస్, బీజేపీ లోక్‌సభ ఎన్నికల్లోనైనా తమసత్తా చాటాలని కార్యాచరణ మొదలుపెట్టాయి. కానీ ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీ ఖమ్మం బరిలో దిగుతారన్న ప్రచారంతో తర్జనభర్జన పడుతున్నాయి. ఒకవేళ సోనియా పోటీచేస్తే ఆమెను ఎలా ఎదుర్కొవాలన్న దానిపై కార్యాచరణకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

వాస్తవానికి ఖమ్మం లోక్‌సభ నుంచి బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత నామ నాగేశ్వరరావు మరోసారి పోటీ చేసే అవకాశం కనిపిస్తుండగా.. దీనిపై ఈనెల 9న హైదరాబాద్‌లో జరిగే బీఆర్ఎస్ సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఈ సమావేశానికి ఖమ్మం లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు హాజరుకాబోతున్నారు. మరోవైపు బీజేపీ కూడా ఖమ్మంలో సోనియాగాంధీ పోటీచేస్తే రాష్ట్ర స్థాయి నాయకులు లేదంటే ప్రముఖులను బరిలో దించే అవకాశం కనిపిస్తోంది. ఏదేమైనా సోనియా గాంధీ పోటీచేస్తారన్న ప్రచారంతో ఖమ్మం పేరు జాతీయస్థాయిలో మారుమోగుతోంది.

పాల్వంచలో ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ ముత్యాలముగ్గుల పోటీ నేడు

అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో కార్యక్రమం



పాల్వంచ టౌన్, జనవరి 5: సంక్రాంతి పండుగ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్ట్‌నర్ స్వర్గసీమ సుకేతన' ముత్యాలముగ్గుల పోటీలు శనివారం భద్రాద్రి జిల్లా స్థాయి పోటీలు పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో జరగనున్నాయి. ఈ పోటీలకు జిల్లాస్థాయిలో అనుబోస్ ఇంజనీరింగ్‌కళాశాల స్పాన్సర్‌గా వ్యవహరిస్తుండగా.. పాల్వంచ కేఎస్పీ రోడ్డులోని అనుబోస్ కళాశాల ప్రాంగణంలో శనివారం ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు పోటీ నిర్వహించనున్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు 9246907418, 9849975126 సెల్ నెంబర్లకు ఫోన్ చేసి గానీ, నేరుగా పోటీ ప్రదేశానికి వచ్చిగానీ పేర్లు నమోదు చేసుకోవచ్చు.

రేపు ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో..

ఖమ్మం సాంస్కృతికం: 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు ఆదివారం ఖమ్మం నగరంలో భక్తరామదాసు కళాక్షేత్రంలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు జరగనున్నాయి. ఈ పోటీలకు జిల్లాస్థాయి స్పాన్సర్‌గా శ్రీబాలాజీ రియల్‌ఎస్టేట్స్ వ్యవహరిస్తోంది.

నూరుశాతం లక్ష్యం

- గురుకులాల ఫలితాలపై అధికారుల దృష్టి
- ఇంటర్, పదో తరగతి పరీక్షలకు ప్రత్యేక కార్యాచరణ



భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం

భద్రాచలం, జనవరి 5 : భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ గురుకుల సంస్థ ఆధ్వర్యంలో ఖమ్మం రీజియన్‌లోని గురుకుల విద్యాసంస్థల్లో నూరుశాతం ఫలితాలే లక్ష్యంగా అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మొత్తం 14 గిరిజన గురుకుల బాలబాలికల పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. ఇందులో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 958 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 1,507 మంది, ద్వితీయ సంవత్సరంలో 1,482మంది పరీక్షలకు సిద్ధమవుతున్నారు. అలాగే ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో(ఈఎంఆర్ఎస్) 366 మంది పరీక్షలు రాయనున్నారు. గతేడాది ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 1,224 మంది పరీక్షలకు హాజరవగా, 1,069 మంది ఉత్తీర్ణత సాధించగా.. 85శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రథమ సంవత్సరంలో 1,283 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా 998 మంది పాసయ్యారు. 81శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే గత సంవత్సరం పదో తరగతిలో 98.79 శాతం ఉత్తీర్ణత రాగా.. ఈ సారి నూరుశాతం ఫలితాలే లక్ష్యంగా... గిరిజన సంక్షేమ గురుకుల సంస్థల కార్యదర్శి ఇనికోలస్ ఆదేశాల మేరకు విద్యార్థులకు ప్రణాళికా బద్ధంగా బోధన జరిగిందని అధికారులు పేర్కొంటున్నారు. ఈసారి అటు పదో తరగతి, ఇటు ఇంటర్‌లో నూరు శాతం ఫలితాలు సాధించాలనే ఏకైక లక్ష్యంతో పాఠ్యాంశాల బోధన జరిగిందని, ప్రత్యేక తరగతులు నిర్వహించామని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ సహకారంతో విద్యార్థులకు అభ్యాసదీపిక పుస్తకాలు అందించి పరీక్షలకు సిద్ధం చేస్తున్నామని గురుకుల సంస్థ రీజినల్ కోఆర్డినేటరు టి.వెంకటేశ్వరరాజు తెలిపారు. ఇదే సమయంలో పరీక్షలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక టైంటేబుల్ రూపొందించి ఉదయం నుంచి రాత్రి వరకు వారిని చదివిస్తున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థులకు స్లిప్ టెస్టులు, ప్రీఫైనల్స్ నిర్వహించి వారిని పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఇదిలా ఉండగా గత విద్యా సంవత్సరంలో కృష్ణసాగర్, కిన్నెరసాని డ్యామ్‌సైట్ నూతన బాలికల కళాశాల, దమ్మపేట కళాశాలలో 60 శాతం ఫలితాలు కూడా రాకపోవడంతో ఈసారి ఈ కళాశాలలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. దీనిపై ఇప్పటికే ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ అధికారులకు దిశదశ నిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 28నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలు, అనంతరం ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల్లో భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గురుకులాల విద్యార్థులు ఏ మేరకు ప్రతిభచాటుతారో వేచి చూడాల్సి ఉంది.



సీపీగా బాధ్యతలు చేపట్టిన సునీల్‌దత్‌ను అభినందిస్తున్న విష్ణువారియర్

ఖమ్మం సీపీగా బాధ్యతలు స్వీకరించిన సునీల్‌దత్

ఖమ్మంక్రైం, జనవరి 5: ఖమ్మం పోలీసుకమిషనర్‌గా సునీల్‌దత్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సీపీ కార్యాలయంలో పూర్వ సీపీ విష్ణువారియర్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. 2014 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సునీల్‌దత్ హైదరాబాద్ సిటీ ఈస్ట్‌జోన్ డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ ఖమ్మం సీపీగా బదిలీపై వచ్చారు. సునీల్‌దత్ గతంలో భద్రాచలం, జగిత్యాల ఏఎస్పీగా, భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీగా పనిచేశారు. 2022 జూలైలో హైదరాబాద్ డీసీపీగా బదిలీపై వెళ్లిన ఆయన ప్రభుత్వ ఉత్తర్వుల నేపథ్యంలో ఖమ్మం సీపీగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు పోలీసు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక విష్ణుఎస్‌వారియర్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొనగా.. ఆయన కేంద్రహోంశాఖ ఉత్తర్వుల మేరకు డిప్యూటేషన్‌పై ఎన్ఐఏకు వెళ్లనున్నట్టు తెలిసింది.

తక్కువ శ్రమతో.. ఎక్కువ లాభాలు పొందాలి

- డ్రాగన్‌ఫ్రూట్ తోట పరిశీలనలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

రఘునాథపాలెం, జనవరి 5 : రైతులు తక్కువ శ్రమ, పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు, లాభాలు వచ్చే పంటలను పండించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. శుక్రవారం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలో పర్యటించిన ఆయన శివాయిగూడెంలోని బానోత్ భీమ్లా అనేరైతుకు చెందిన డ్రాగన్‌ఫ్రూట్ తోటను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి రైతులతో మాట్లాడిన తుమ్మల పంటలసాగు గురించి తెలుసుకుని.. పలు పంటల గురించి వారికి వివరించారు. ఏళ్ల తరబడి ఒకే రకమైన పంటలు సాగుచేయకుండా తక్కువ నీటివినియోగం ఉండే పంటలు వేసుకోవాలని, అలాగే తక్కువ శ్రమతో ఎక్కువ దిగుబడి, లాభాలు వచ్చే పంటలను సాగు చేయాలని సూచించారు. కాలానుగుణంగా పంటమార్పిడితో ఆర్థికాభ్యున్నతి సాధించాలని ఆకాంక్షించారు. రైతు భీమ్లాతో మాట్లాడిన ఆయన పండు మంచి సైజు వచ్చిందని.. మంచి యాజమాన్య చర్యల తీసుకున్నారంటూ అభినందించారు. మంత్రి వెంట టీపీసీసీ సభ్యుడు ఎండీ జావీద్, పుచ్చకాయల వీరభద్రం, కార్పొరేటర్ లకావత్ సైదులునాయక్, కాంగ్రెస్ మండల కన్వీనర్ బాలాజీనాయక్, తదితరులున్నారు.



డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ప్రజాపాలన సభలను ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి తుమ్మల

రఘునాథపాలెం మండల పర్యటనలో భాగంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం మారుమూల గిరిజన గ్రామాలైన రాంక్యాతండా, సూర్యాతండాల్లో జరుగుతన్న ప్రజాపాలన గ్రామసభలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఆయన ప్రభుత్వ ఆరు గ్యారెంటీ పథకాల్లో ప్రజలేం కోరుకుంటున్నారని, గ్రామసభలకు వచ్చే ప్రజలకు అధికారులు కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. గ్రామసభలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులతో మాట్లాడిన ఆయన గ్రామాల్లో ఉన్న నివాసాల సంఖ్య, పంపిణీ చేసిన దరఖాస్తుల గురించి తెలుసుకున్నారు. దరఖాస్తుదారులతో మాట్లాడి వారు ఆశిస్తున్న సంక్షేమ పథకాల గురించి తెలుసుకుని..అర్హులైన వారికీ పథకాలు అందుతాయని హామీఇచ్చారు. ఆయ న వెంట తహసీల్దార్ లూథర్‌విల్సన్, ఎంపీడీవో రామకృష్ణ, టీపీసీసీ సభ్యులు ఎండీ జావీద్, పుచ్చకాయల వీరభద్రం, కార్పొరేటర్ లకావత్ సైదులునాయక్, మండల కాంగ్రెస్ కన్వీనర్ బాలాజీనాయక్ పాల్గొన్నారు.



ప్రజాపాలన గ్రామసభకు వచ్చిన మహిళతో మాట్లాడుతున్న తుమ్మల

మిర్చి ధర పతనం

- ఖమ్మం మార్కెట్‌లో ఒక్కరోజులో క్వింటాకు రూ.4వేలు తగ్గుదల
- ఆందోళన చెందుతున్నరైతులు

ఖమ్మం, జనవరి 5 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధర భారీగా తగ్గింది. ఒక్కరోజులోనే క్వింటాకు రూ.4వేలు పతనం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం క్వింటా మిర్చి ధర రూ.23వేలు పలకగా శుక్రవారం ఆ ధర రూ.19వేలలోపు మాత్రమే పలకింది. జెండాపాట ధర రూ.23వేలు పెట్టగా ఆధరకు ఎవరు మిర్చి కొనుగోలు చేయలేదు. ఎక్కువశాతం వ్యాపారులు రూ.18వేలు మొదలు రూ.19వేలు వరకు ధర చెల్లించి మిర్చి కొనుగోలు చేశారు. ఇలా వ్యాపారులు ఒక్కరోజులోనే క్వింటాకు రూ.4వేలు ధర తగ్గించడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. రోజూ ఖమ్మం మార్కెట్‌కు 5వేల నుంచి 7వేల బస్తాల వరకు మిర్చి అమ్మకాలకు వస్తుండగా.. శుక్రవారం 8500బస్తాలు వచ్చాయి. గురువారం వరకు రూ.23వేలు ధర పలకడంతో మున్ముందు మరింత పెరుగుతుందని భావిస్తున్న రైతులు శుక్రవారం భారీగా తగ్గిన ధరతో కుదేలయ్యారు. చాలామంది రైతులు పంటను అమ్మకుండా తిరిగి తీసుకెళ్లారు. కొందరు తమకున్న ఆర్థిక అవసరాల దృష్ట్యా నష్టానికైనా తెగనమ్ముకున్నారు. ప్రస్తుతం విదేశాల నుంచి ఎగుమతి ఆర్డర్లు చురుగ్గాలేకపోవడమే మిర్చి ధరల తగ్గుదలకు కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు.



ఖమ్మం మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు

కాలువలకు కాసులేవీ?

- అధ్వానంగా వైరా కుడి, ఎడమ కెనాల్స్
- ఏళ్లుగా బడ్జెట్లో కేటాయింపులే తప్ప పైసా మంజూరు కాని వైనం
- ఆర్థిక మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కపైనే అన్నదాతల ఆశలు

వైరా, జనవరి 5: వైరా రిజర్వాయర్ కుడి, ఎడమకాల్వల ఆధునికీకరణ పనులకు అవసరమైన నిధులు కొత్త ప్రభుత్వంలోనైనా మంజూరు చేయాలని, జిల్లాకు.. ముఖ్యంగా వైరా ప్రాంతానికి చెందిన మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రిగా ఉన్న నేపథ్యంలో బడ్జెట్లో ఈ కాలువల ఆధునికీకరణ పనులకు నిధులు మంజూరు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు. గత బీఆర్ఎస్ హయాంలో మాదిరిగానే మొండిచేయి చూపొద్దని, ఏ పదవి లేని సమయంలోనే భట్టి విక్రమార్క తన పలుకుబడితో ఏపీ నీటిపారుదల జీవనోపాదుల అభివృద్ధి పథకం కింద జపాన్ బ్యాంకు నుంచి దాదాపు రూ.65కోట్ల నిధులు మంజూరు చేయించి కొంతమేరకు కాల్వలను అభివృద్ధి చేశారు. అలాంటి భట్టి విక్రమార్క ఇప్పుడు రాష్ట్ర ఆర్థికశాఖమంత్రిగా ఉన్న నేపథ్యంలో నిధులు కేటాయించాలని రైతులు కోరుకుంటున్నారు.

2008-09లో ఆధునికీకరణ పనులు

వైరా రిజర్వాయర్ నిర్మాణానికి పునాది పడి వందేళ్లు దాటింది. కుడి, ఎడమకాల్వల ద్వారా అధికార, అనధికారికంగా 25వేలకుపైగా ఎకరాలు సాగవుతుండగా.. అధికారికంగా మాత్రం 17300 ఎకరాలకు వరప్రదాయనిగా ఉంది. అంతేకాకుండా ఈ రిజర్వాయర్‌పై ఆధారపడి మూడు మండలాల్లోని వేలాది మంది మత్స్యకారులు జీవిస్తున్నారు. అలాగే 11మండలాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే భట్టి విక్రమార్క చొరవతో 2006 నుంచి వైరా కాల్వల అధ్వాన పరిస్థితిపై అధికారులు పలు మార్లు సర్వేలు చేసి నిధుల కోసం ప్రతిపాదనలు రూపొందించారు. ఆసమయంలో తమ సమీప బంధువైన మైలవరం ఎమ్మెల్యే కోనేరు రంగారావు.. వైఎస్ఆర్ ప్రభుత్వంలో మంత్రిగా ఉండటంతో ఆయన ద్వారా రూ.65కోట్ల జపాన్ బ్యాంకు నిధులు మంజూరు చేయించారు. 2007లో ఆ నిధుల మంజూరు వ్యవహారం తుదిరూపం సంతరించుకుంది. 2007లోనే భట్టి విక్రమార్క స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నిక కావడం అప్పటి మధిర ఎమ్మెల్యే కట్టా వెంకటనర్సయ్య సహకారం తీసుకొని సీఎం రాజశేఖర్‌రెడ్డి ద్వారా పనులు ప్రారంభింపజేశారు. 2009 జనవరి 4న వైఎస్ ఈ పనుల నిర్మాణాన్ని ప్రారంభించారు. ఆ సమయంలో మొదట జపాన్ బ్యాంకు నుంచి రూ.50.43కోట్లు మంజూరవగా ఆతర్వాత చేసిన పనులు రూ.65కోట్లకు చేరుకున్నాయి. కానీ కుడి, ఎడమకాల్వలు రూపురేఖలు మాత్రం కొంత మేర మారాయి. కుడికాలువ 24కిలోమీటర్ల పొడవు ఉండగా, 7.8కిలోమీటర్ల వరకు ఇరువైపులా సిమెంట్ గైడ్‌వాల్స్ నిర్మించారు. దీంతో ఈ దూరం వరకు సాగునీటి సరఫరా వృథాకు అడ్డుకట్టపడింది. ఇంకా 16.2కిలోమీటర్ల సిమెంట్ గైడ్‌వాల్స్ నిర్మించాల్సి ఉంది. ఈ దూరంలో ఉన్న కాల్వ మొత్తం అత్యంత అధ్వానంగా ఉంది. కాల్వగట్లు బలహీనంగా ఉన్నాయి. ఏటా సీజన్‌లో సాగునీరు వృథా అవుతూ చివరి భూములకు నీరందక పంటలు ఎండిపోతున్నాయి. అలాగే ఎడమకాలువ 15.15కిలోమీటర్లు పొడవు ఉండగా 9.555కిలోమీటరు వరకు గైడ్‌వాల్స్ నిర్మించారు. ఇంకా ఆరు కిలోమీటర్లు నిర్మించాల్సి ఉంది. అలాగే లింగన్నపాలెం బ్రాంచ్ కెనాల్ మూడుకిలోమీటర్లు గైడ్‌వాల్స్ నిర్మించాల్సి ఉంది. జపాన్ బ్యాంకు నిధులతో వైరా రిజర్వాయర్ గుట్టల మధ్య ఐదో అలుగును కూడా నిర్మించారు. దానివలన రిజర్వాయర్‌కు భారీ వరద నీరు వచ్చినా ఎలాంటి ప్రమాదం ఉండదు.

2014తర్వాత పట్టించుకున్నోళ్లు లేరు..

ఉమ్మడి రాష్ట్రంలో మాత్రమే వైరా కాలువల ఆధునికీకరణ జరగ్గా.. 2014లో రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ఆధునికీకరణ పనులకు పైసా మంజూరు చేయలేదు. అంతేకాకుండా నీటితీరువా కూడా రద్దుచేయడంతో కాల్వల నిర్వహణ కష్టంగా మారింది. కేసీఆర్ ప్రభుత్వం 2016 బడ్జెట్‌లో వైరా కాల్వల ఆధునికీకరణకు రూ.39కోట్లు కేటాయించింది. నీటిపారుదలశాఖ అధికారులు రూ.56కోట్లకు ప్రతిపాదించగా అప్పటి ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ రూ.39కోట్లు కేటాయించారు. కానీ ఒక్క పైసా విడుదల కాలేదు. 2017-2018, 2019బడ్జెట్లలో రూ.29కోట్లు కేటాయించారు. ఆతర్వాత బడ్జెట్లో కూడా నిధుల కేటాయింపే తప్ప పైసా విడుదల కాలేదు.



కోతకు గురై బలహీనంగా ఉన్న వైరా కుడికాల్వ కట్ట

కొత్త సర్కారు పెట్టే బడ్జెట్‌పైనే ఆశలు

త్వరలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్లోనైనా వైరా కాలువల ఆధునికీకరణకు మోక్షం కలుగుతుందని, ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క నిధులు కేటాయిస్తారని రైతులు ఆకాంక్షిస్తున్నారు. ప్రస్తుతం ఈ రెండు కాల్వలు పూర్తిస్థాయిలో ఆధునీకరణ జరగాలంటే కనీసంగా రూ.80కోట్ల నుంచి రూ.100కోట్ల నిధుల అవసరముంది. ఒకేసారి కాకపోయినా ఈ ఏడాది బడ్జెట్లో కొంతమేర, వచ్చే బడ్జెట్లో మిగిలిన నిధులను కేటాయించాలని రైతులు కోరుతున్నారు.

క్రైం సమాచారం

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

బూర్గంపాడు, జనవరి 5: అనారోగ్యంతో మనస్తాపం చెంది పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బూర్గంపాడు మండలం అంజనాపురంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అంజనాపురం గ్రామానికి చెందిన తేజావత్ శ్రీను(38) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మనస్తాపం చెంది గురువారం రాత్రి పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు భద్రాచలంలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి గోవింద్ ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అందరితో కలివిడిగా ఉండే శ్రీను మృతితో స్థానికంగా విషాదచాయలు అలుముకున్నాయి.

ఉరివేసుకుని గ్రానైట్ కార్మికుడు..

ఖమ్మం రూరల్, జనవరి 5: ఉరివేసుకుని ఓ గ్రానైట్ కార్మికుడు మృతి చెందిన సంఘటన ఖమ్మం రూరల్ మండలం, గుర్రాలపాడులో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమబెంగాల్ రాష్ట్రం దక్షిణ 24 పరగణాలు జిల్లా బిష్ణుపూర్ గ్రామానికి చెందిన పంచన్ దాస్ (35) రెండేళ్లుగా గుర్రాలపాడులోని ఓ గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తు అక్కడే నివాసం ఉంటున్నాడు. డిసెంబరు 6న ద్విచక్రవాహనంపై నుంచి కిందపడ్డాడు. నాటి నుంచి పంచన్‌దాస్‌కి మానసిక స్థితి సక్రమంగా లేదు. దీనికి తోడు మద్యానికి బానిసైయ్యాడు. శుక్రవారం తెల్లవారుజామున రేకులషెడ్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మానసిక స్థితి సక్రమంగా లేక మద్యం మత్తులో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డడని కార్మికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

అశ్వాపురం జనవరి 5: మండల పరిధిలోని కల్యాణపురం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. సంఘటనపై శుక్రవారం అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. వివరాలిలా ఉన్నాయి. కల్యాణపురం గ్రామానికి చెందిన గుమ్మడి దేవరం(58) గ్రామంలో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అశ్వాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా దేవరం మృతదేహన్ని ఎంపిపి ముత్తినేని సుజాత సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మురళీ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రగా దైవ దర్శనానికి వెళ్తూ

స్పృహతప్పి రోడ్డుపై పడి మృతి..

పాల్వంచ, జనవరి 5: స్పృహతప్పి రోడ్డుపై పడిన వ్యక్తి మృతిచెందిన సంఘటన పాల్వంచ మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గార్ల మండలం కొత్త పోచారం గ్రామానికి చెందిన మీవీదు అంజయ్య (55) భద్రాచలం దైవ దర్శనానికి పాదయాత్రగా బయలుదేరాడు. ఈ నెల 3న ఇంటి నుంచి బయలుదేరి 5న పాల్వంచ మండలం జగన్నాధపురం చేరుకున్నాడు. అక్కడ బసచేసిన అతను ఉదయం భద్రాచలానికి బయలుదేరి కొద్దిదూరం వెళ్ళగానే కళ్లు తిరిగి రోడ్డుపై పడ్డాడు. దీంతో అతని తలకు గాయమై రక్తస్రావం ఏర్పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువు రవీంద్రబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

పేకాటాడుతున్న తొమ్మిదిమంది అరెస్ట్

సత్తుపల్లిరూరల్, జనవరి5: సత్తుపల్లి మండలంలో పేకాటాడుతున్న 9మందిపై కేసు నమోదుచేసినట్లు పట్టణ సీఐ జే.మోహనబాబు తెలిపారు. గురువారం రాత్రి మండలంలోని సిద్ధారం సమీపంలోని ఓ ప్రదేశంలో పేకాటాడుతున్నట్లు తమకు సమాచారం అందగా దాడిచేశామన్నారు. ఈ దాడిలో 9మందిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించగా వారివద్ద నుంచి రూ.85,360నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. సత్తుపల్లి పరిధిలో పేకాట, కోడిపందెలపై అనుమతులు లేవని, నిర్వహించినా, ఆడినా చట్టరీత్యా చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

ద్విచక్రవాహనాన్ని దహనం చేసిన దుండగులు


దహనమైన వాహనం

మధిర రూరల్, జనవరి 5: మధిర మండలం ఆత్కూరు ఎస్సీ కాలనీలో గురువారం అర్ధరాత్రి పల్లెపోగు కిషోర్ అనే యువకుడికి చెందిన ద్విచక్రవాహనానికి దుండగులు పెట్రోల్ వేసి నిప్పంటించారు. బాధితుడు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కిషోర్ తన ఇంటి ప్రాంగణంలో ద్విచక్రవాహనాన్ని పెట్టి ఉంచాడు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ వాహనానికి పెట్రోల్ పోసి దుండగులు నిప్పంటించడంతో దగ్ధమైపోయింది. తెల్లవారుజా మున లేచి చూసేసరికి తన వాహనం దగ్ధమై ఉండంతో కిషోర్ లబోదిబోమంటున్నాడు. ఈ ఘటనపై టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అయితే బా. దిత కిషోర్ బంధువులు మధిరకు చెందిన ప్రభాకర్ ఈ ద్విచక్రవాహనాన్ని దహనం చేసి ఉంటాడని, తనకు ప్రభాకర్‌కు మధ్య విభేదాలు ఉన్నాయని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదు క్వింటాళ్ల మిర్చి చోరీ

ముదిగొండ, జనవరి 5: ముదిగొండ మండలం మాధాపురంలో ఓ రైతుకు చెందిన మిర్చి చోరీకి గురైంది. గ్రామానికి చెందిన రైతు నాగేశ్వరరావు పొలంలో మిర్చిని కోసి ఆరబోయగా బుధవారం అర్ధరాత్రి చోరీకి గురికావడంతో గురువారం రాత్రి రైతు నాగేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన పొలంలో ఉన్న ఐదు క్వింటాళ్ల మిర్చిని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని రైతు నాగేశ్వరరావు ఫిర్యాదులో పేర్కొన్నాడు. సంఘటనాస్థలాన్ని పోలీసులు శుక్రవారం పరిశీలించారు.

బస్వాపురం శివాలయంలో ..

చింతకాని జనవరి 5: మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలోని శివాలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దొంగలు ఆలయం తాళం పగలగొట్టి ఆలయంలోకి ప్రవేశించి హుండిలోని 60వేల నగదు, సౌండ్ సిస్టమ్‌ను అపహరించారు. శుక్రవారం ఉదయం ఆలయాన్ని శుభ్రపరిచేందుకు వచ్చిన స్వీపర్ విషయాన్ని గ్రామస్థులకు, పోలీసులకు తెలయపరచడంతో క్లూస్ టీం సిబ్బంది చేరుకుని వేలిముద్రలను సేకరించారు. సర్పంచ్ రాసాల సాంబలక్ష్మీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ధంసలాపురం ఆలయంలో..

ఖమ్మం క్రైం జనవరి 5: ఖమ్మం నగర శివారు ధంసలాపురంలోని పురాతన శ్రీ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో చోరి జరిగింది. ఆలయ పూజారి శంభుప్రసాద్ వివరాల ప్రకారం గురువారం ఆలయంలో రాత్రి ప్రవేశించిన దుండగులు హుండీలను పగులగొట్టి భక్తులు సమర్పించిన సుమారు రూ.15 వేల నగదు చోరి చేశారని తెలిపారు. శుక్రవారం ఉదయం ఆలయానికి వెళ్లి తాళాలు పగులగొట్టి ఉండటం చూసి ఖానాపురంహవేలి పోలీసులకు సమాచారం అందించి ఫిర్యాదు చేశామన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఆటో.. ఐదుగురికి గాయాలు

సత్తుపల్లిరూరల్, జనవరి 5: ఆగివున్న ఆర్టీసీ బస్సును ఆటో ఢీకొట్టిన ప్రమాదంలో ఐదుగురికి గాయాలైన సంఘటన శుక్రవారం సత్తుపల్లి మండలం తుంబూరులో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రాలోని ఏలూరు జిల్లా చాట్రాయి మండలం గంటెపాడుకు చెందిన 15మంది వ్యవసాయ కూలీలు సత్తుపల్లి మండలం కిష్టాపురంలో పొలం పనుల కోసం ఆటోలో వస్తున్నారు. ఈ క్రమంలో వేంసూరు మండలం నుంచి సత్తుపల్లికి వస్తున్న సత్తుపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మండలంలోని తుంబూరు వద్ద ఆగడంతో అది గమనించని ఆటో డ్రైవర్ ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తుమ్మలపల్లి నాగమణి, మరియమ్మ, దేవమాత, మహాలక్ష్మీ, సూరమ్మలకు గాయాలవ్వగా 108లో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

టిప్పర్, కారు ఢీ..

సత్తుపల్లిరూరల్, జనవరి5: సత్తుపల్లి మునిసిపాలిటీలో బాలాజీ థియేటర్ ఎదురుగా టిప్పర్, కారు ఢీకొన్న సంఘటనతో ట్రాఫిక్ జామ్ అయింది. సుమారు అర్ధగంట పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునఃరుద్ధరించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

పెళ్లి ఊరేగింపుపై దాడి.. ఆరుగురిపై కేసు

పాల్వంచ, జనవరి 5: పెండ్లి ఊరేగింపుపై దాడి చేసిన ఘటనలో ఆరుగురిపై పాల్వంచ రూరల్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం సూరారం గ్రామానికి చెందిన చీకటి ప్రసాద్ తన అన్న కుమార్తె వివాహానికి గురువారం మైసమ్మ గుడి వద్ద హాజరయ్యాడు. వివాహ అనంతరం అక్కడి నుంచి తన బంధుమిత్రులతో కలసి నూతన దంపతులను ఊరేగింపుగా తన ఊరికి తీసుకుని వెళుతున్నాడు. ఈ క్రమంలో సూరారం గ్రామంలోకి చేరుకుని ప్రధాన కూడలి వద్ద డీజే సౌండ్ పెట్టి పెండ్లి బృందం డ్యాన్సులు చేస్తుండగా సమీప ఇంటి యజమానులైన బానోత్ శ్రీను, సాయికుమార్, బానోత్ కుమార్, మంగమ్మ, సక్కుబాయి, ధనశ్రీలు పాత కక్షలు మనసులో పెట్టుకుని పెండ్లి బృందంతో వాగ్వాదానికి దిగి దుర్భాషలాడారు. కారు అద్దాలు పగులగొట్టారు. అడ్డుపడిన చీకటి ప్రసాద్ పై బౌతిక దాడికి పాల్పడి చంపుతామని బెదిరించారు. ప్రసాద్ ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ హెడ్ కానిస్టేబుల్ రాములు తెలిపారు.

మన ఊరు.. మనబడి పనుల్లో నాణ్యత డొల్ల

- మర్కోడు పాఠశాల నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు
- కప్పి పుచ్చేందుకు మట్టిపోసి పనులు ప్రారంభం
- పత్రికల్లో కథనాలు వచ్చినా పట్టించుకోని అధికారులు

ఆళ్లపల్లి, జనవరి 5: పత్రికల వాళ్లు అలాగే రాస్తారు.. గ్రామస్థులు అలాగే చెప్పుతుంటారు.. మీ పని మీరు కానివ్వండి, మేము చేసే పని మేము చేస్తాం.. అన్నట్టుగా ఉంది ఆళ్లపల్లి మండలం, మర్కోడులో మన ఊరు-మనబడి పాఠశాల భవన నిర్మాణ పనుల్లో అధికారుల పరివేక్షణ తీరు. ఏడాది క్రితం మనఊరు-మనబడిలో మర్కోడు ఎంపీపీఎస్‌కు నిధులు రావడంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఏడు నెలల క్రితం పనులు మొదలు పెట్టారు. పునాది పనుల్లో అధికారుల పరివేక్షణ కొరవడి, పునాదులు లోతుతక్కువ తీసి పనులు నిర్వహించగా, కొందరు గ్రామస్థులు లోతు తక్కువతీసి పనులు చేస్తున్నారని అధికారులకు తెలిపారు. దాంతో మళ్లి లోతు ఎక్కువ తీసి పనులు చేశారు. రెండోసారి సైతం పునాదుల నుంచి పెడల్‌స్టాల్ ఏర్పాటు చేయగా, పెడల్‌స్టాల్ నుంచి పిల్లర్, భీమ్‌కు వచ్చే రాడ్లు సుమారు ఏడు అంగులాలు పక్కకు వంచి బీమ్ పోసే క్రమంలో అధికారుల పర్యవేక్షణ లేక అలాగే పనులు చేపట్టారు. విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' అడిగేవారేవరు..?" అని కథనంతో నాణ్యతలోపాన్ని గుర్తించి ప్రచూరించింది. దాంతో ఏఈ పనులు తీరిగి చేపడుతామని తెలిపారు. అయినపట్టికి పనుల్లో డొల్లతనాన్ని సరిచేయక పోగ, తప్పులను కప్పిపుచ్చేందుకు, కొందరి సమక్షంలో ఓ ఒప్పంద పత్రం రాసుకుని, రెండు రోజుల క్రితం మట్టిపోసి కప్పిపుచ్చె ప్రయత్నం చేశారని, గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహిస్తున్నారు. మొదటి నుంచి నాణ్యతలేని పనులు స్పష్టంగా కనిపిస్తున్నపట్టికి అధికారులు మాత్రం, తమకేమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కలెక్టర్ 'మనఊరు మనబడి' పనులు త్వరగా పూర్తి చేయలని హెచ్చరిస్తున్నపట్టికి మర్కోడు ఎంపీపీఎస్ భవన నిర్మాణం మాత్రం పునాదుల్లోనే ఉంది. జిల్లా అధికారులు సైతం మర్కోడు ఎంపీపీ పాఠశాల భవన నిర్మాణంపై చిన్నచూపు చూస్తున్నారని, భవనం లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, పనులు నాణ్యతో చేపట్టి భవనం త్వరగా అందుబాటులోకి తీసుకరావాలని, విద్యార్థుల తల్లితండ్రులు, వివిధ పార్టీల నాయకులు కోరుతున్నారు.


బీమ్ పోయకముందు, పోసిన తరువాత, రాడ్ బెండింగ్


డొల్లతనం కనిపించకుండా మట్టిపోసిన దృశ్యం

లక్ష్య సాధనకు సమష్టిగా ముందుకెళదాం

- 70 మిలియన్ టన్నుల ఉత్పత్తిని సాధించాలి
- జీఎంలతో సమీక్షలో సింగరేణి సీఎండీ బలరాం


సమీక్షలో మాట్లాడుతున్న సీఎండీ బలరాం

రుద్రంపూర్, జనవరి 5: ఈ ఏడాది సింగరేణి కాలరీస్‌లో నిర్ధేశించుకున్న 70 మిలియన్ టన్నుల ఉత్పత్తిని సాధించేందుకు ప్రతీ ఒక్కరు అంకిత భావంతో పని చేయాలని సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి సింగరేణిలోని అన్ని విభాగాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి వారికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ఇంధన అవసరాలు, రానున్న వేసవి కాలంలో థర్మల్ విద్యుత్ కేంద్రాల వద్ద 21రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉండేందుకు వీలుగా రోజుకు 2.24లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలని, రోజుకు 15లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలిగించాలని ఆదేశించారు. సంస్థ పురోగభివృద్ధికి ప్రతీ ఒక్కరు పాటు పడాలని తెలిపారు. అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది మొదటి 9 నెలల కాలంలో బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓవర్ బర్డెన్ తొలిగింపు ఆశాజనకంగా ఉన్నాయని పేర్కొన్నారు. గతేడాదితో పోలిస్తే బొగ్గు ఉత్పత్తిలో 5.15శాతం వృద్ధితో 49.66మిలియన్ టన్నులు, రవాణాలో 8శాతం వృద్ధితో 51మిలియన్ టన్నులు, ఓవర్ బర్డెన్ తొలిగింపులో 6 శాతం వృద్ధితో 306.6మిలియన్ క్యూబిక్ మీటర్ల మేర లక్ష్యాలను సాధించినట్టు తెలిపారు. ఇదే స్పూర్తితో రానున్న మూడు నెలల్లోను సమష్టిగా లక్ష్య సాధనకు కృషి చేయాలని కోరారు. నూతన ప్రాజెక్టుకు ప్రారంభించడంలో ఎదురవుతున్న అవాంతరాలను అడిగి తెలుసుకొని రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి భూసేకరణ, ఇతర అనుమతులపై ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. సింగరేణి సంస్థ ఒడిస్సాలోని నైనిలో చేపట్టిన బొగ్గు బ్లాక్ నుంచి ఉత్పత్తిని సాధ్యమైనంత త్వరగా ప్రారంభించేందుకు ఆ రాష్ట్ర ఉన్నతాధికారులతో మాట్లాడతానని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు విషయంలో ఒడిస్సా రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారని, ఆయన నేతృత్వంలో త్వరలో సింగరేణి ఉన్నత అధికారుల బృందం రాష్ట్రంలో పర్యటిస్తుందని వెల్లడించారు. ఈ సమీక్ష సమావేశంలో సంస్థ డైరెక్టర్లు బి.సత్యనారాయణ (ఈఅండ్ఎం), ఎన్‌వీకే శ్రీనివాస్(ఆపరేషన్సు), జి.వెంకటేశ్వరరెడ్డి (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్), జె.ఆల్విన్(జీఎం కో-ఆర్డినేషన్), ఎం.సురేష్(జీఎం సీపీపీ), జక్కం రమేష్ జీఎం(ఎంపి), మల్లెల సుబ్బారావు జీఎం(మార్కెటింగ్), జి.దేవేందర్ జీఎం (సివిల్) తదితరులు పాల్గొన్నారు.

హైవే నిర్వాసిత రైతుల గుర్తింపునకు సర్వే

- పాక్షికంగా భూములు కోల్పోతున్న 105 మంది రైతులు

ఇల్లెందు, జనవరి 5: జాతీయ రహదారి-930పీ నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధిత రైతులను గుర్తించడానికి ఇల్లెందు మండల రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు, జిల్లాలో జాతీయ రహదారి పనులు నాలుగవ దశలో ఇల్లెందు మండలం నెహ్రూనగర్ నుంచి కొత్తగూడెం వరకు చేపడుతున్నారు. వలిగొండ నుంచి కొత్తగూడెం వరకు 234 కిలోమీటర్ల పొడవునా జాతీయ రహదారి-930పి ని నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో తొలి దశలో గౌరెపల్లి నుంచి వలిగొండ వరకు, రెండోదశలో వలిగొండ నుండి తొర్రూరు వరకు, మూడవ దశలో తొర్రూరు నుంచి బయ్యారం మండలం నామాలపాడు వరకు, నాలుగవ దశ నామాలపాడు నుంచి కొత్తగూడెం వరకు జాతీయ రహదారి పనులు చేపడుతున్నారు. ఈ మేరకు ఐదు నెలల క్రితమే డీపీఆర్ రూపకల్పనకు సర్వే జరిపారు. ఈ సర్వేలో ఇల్లెందు మండలంలోని 105 మంది రైతులకు చెందిన భూములు రహదారి నిర్మాణంలో కోల్పోవడంతో నష్టపరిహారం చెల్లించేందుకు అధికారులు సర్వే చేపట్టారు. కొన్నిచోట్ల డీపీఆర్ సర్వేలో విద్యుత్‌లైన్లు, మిషన్‌భగీరథ పైపులు, చెట్లు, తొలగించవలసి ఉన్నట్లు, మరి కొన్ని రైతుల భూములు సేకరించాల్సి ఉన్నట్టు గుర్తించారు. ఈ క్రమంలో రైతుల నుంచి సేకరించవలసిన భూములకు నష్టపరిహారం చెల్లించవలసి ఉంది. దాదాపు 105 మంది రైతులకు నష్ట పరిహారాలు పొందడానికి అర్హులుగా సర్వేలో అధికారులు గుర్తించారు. ఈ మేరకు రైతుల భుములు సేకరించి విసీర్ణాలు, బాధిత రైతులను నిర్ధారించడానికి కలెక్టర్ ఆదేశాలతో శుక్రవారం నుంచి ఇల్లెందు మండల రెవెన్యూ అధికారులు ప్రత్యేక సర్వేలు నిర్వహిస్తు లబ్దిదారులను గుర్తిస్తున్నారు. తహసీల్దార్ కోట రవికుమార్, ఆధ్వర్యంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పద్మ, కామేశ్వరావు, సర్వేయర్ ప్రియాంక తదితర అధికారులు భూములు కోల్పోతున్న రైతులను స్వయంగా గుర్తించి, నిర్ధారించే సర్వేలు చేపట్టారు. నష్టపరిహారాల చెల్లింపులు జరిపిన వెంటనే జాతీయ రహదారి పనులు ప్రారంభిస్తున్నట్టు అధికార వర్గాలు తెలిపారు.

అడవి జంతువులను వేటాడకుండా గస్తీ నిర్వహించాలి

- అటవీ సంపదను పరిరక్షించాలి
- డీఎఫ్‌వో కిష్టగౌడ్


నీటి కుంటను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో కిష్టగౌడ్

జూలూరుపాడు, జనవరి 5: అటవీ ప్రాంతాలలో ఎవరైన వ్యక్తులు, వేటగాళ్లు అడవి జంతువులను వేటాడకుండా సిబ్బంది పటిష్టగస్తీని నిర్వహించాలని డీఎఫ్‌వో జి.కిష్టగౌడ్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన జూలూరుపాడు అటవీరేంజ్ పరిధిలోని గుండెపుడి సెక్షన్‌లోని నల్లబండబోడు బీటులో ఉన్న కనకగిరి అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. అటవీ ప్రాంతంలోని సాజ అడవిని తిరిగి చూశారు. అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన నీటి కుంటలు, చెక్‌డ్యామ్‌లను పరిశీలించారు. అటవీ ప్రాంతంలో ఉన్న చెట్ల రకాలు, అడవి జంతువుల సంచారం వివరాలను సిబ్బంది నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతాలలో గిరిజన, గిరిజనేతరులు కలపను నరకడం కానీ, కొత్త పోడుసాగు చేయకుండా చూడాలన్నారు. అటవీ సంపదను పరిరక్షించాలని కోరారు. అడవి జంతువులను వేటాడకుండా అటవీ ప్రాంత సమీప గ్రామాలలో అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డివో యు . కోటేశ్వరరావు, ఎఫ్‌ఆర్వో ప్రసాద్‌రావు, డీఆర్వో లక్ష్మీనర్సు, డిప్యూటీ డీఆర్వో ధనలక్ష్మీ, ఎఫ్‌బీవోలు కిషన్, రహీం, రవి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఎర్రమట్టి దందా


అర్ధరాత్రి మట్టి తోలకాలు నిర్వహిస్తున్న దృశ్యం

దమ్మపేట, జనవరి 5: పగలైతే మట్టి తోలకానికి అనుమతులు కావాలి అందరికి సమాదానం చెప్పాలి.. అదే రాత్రి ఎవరు పట్టించుకోరూ అని అర్ధరాత్రి ఎర్రమట్టి అక్రమ దందాకు తెరలేపారు. యథేచ్ఛగా మట్టి తోలకాలు నిర్వహించారు. వివరాలు ప్రకారం మందలపల్లి గ్రామ శివారులలో గురువారం అర్ధరాత్రి కొందరు మట్టి అక్రమ తోలకాలు నిర్వహించారు. సుమారు 30 పైగా ట్రాక్టర్లు మూడు ఎక్సకవేటర్లతో యథేచ్ఛగా అక్రమ మట్టి తోలకాలు పెద్ద ఎత్తున నిర్వహించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రాత్రి పూట ట్రాక్టర్లు తీవ్రశబ్ధం రావటంతో కొందరు గ్రామస్థులు మట్టి అక్రమంగా తరలిస్తున్నారని 100కు ఫిర్యాదుచేశారు. ఈవిషయం తెలుసుకున్న మట్టి దందా నిర్వహిస్తున్న నిర్వహకులు పోలీసులు అక్కడకు చేరుకునే లోపే పరారయ్యారు. ఈవిషయం పై ఎస్‌ఐ రవికుమార్‌ను వివరణ కోరగా మట్టి అక్రమ తోలకాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావటంతో అక్కడకు వెళ్లే సరికి ఎవరు లేరని మట్టి తోలకాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. మట్టి దందాపై తహసీల్దార్ ముజాహిద్ ను వివరణ కోరగా అర్ధరాత్రి మటి తోలకాలు అక్రమంగా నిర్వహించినట్లు తనదృష్టికి వచ్చిందని అక్రమ మట్టితోలకాలపై మైనింగ్‌శాఖా అధికారులకు సమాచారమిస్తానని విచారణ జరిపి చర్యలు తీసుకుంటానన్నారు.

ఆరుగురి పై ఎక్సైజ్ బైండోవర్ కేసులు

కల్లూరు, జనవరి 5 మండలంలోని పలు గ్రామాల్లో ఎక్సైజ్ దాడులు నిర్వహించి శుక్రవారం ఆరుగురిపై బైండవర్ కేసులు నమోదు చేసినట్టు ఎక్సైజ్ ఎస్‌ఐ ఎం వెంకటేష్ తెలిపారు. మండలంలోని బత్తుపల్లి, కొత్తబోడిమేల్లి, హనుమతండ గ్రామాలలో కాపు సారా తయారికి పాల్పడుతున్న వారిని పై విధంగా గుర్తించటం జరిగిందని చెప్పారు. నిందితులు ఇక కాపు సారా తయారికి పాల్పడకుండ వారిని మండల తహసిల్దార్ ఎదుట హాజరు పరిచామని ఆయన వివరించారు. ఇక ముందు కాపు సారా తయారికి పాల్పడినచో వారిపై ఏడాది పాటుగా జైలు శిక్షతో పాటుగా జరిమానా విధించటం జరుగుతుందని ఎక్సైజ్ ఎస్‌ఐ తెలిపారు. సత్తుపల్లి ఎక్సైజ్ సిఐ సూచన మేరకు వారిని తహసిల్దార్ ముందు బైండవర్ చేయటం జరిగిందన్నారు.

ఫోన్‌పే పేరుతో మోసం


యజమానిరాలితో మాట్లాడుతున్న కిలాడీ మహిళలు

వైరా, జనవరి 5: వైరాలో ఫోన్ పే ద్వారా మోసానికి పాల్పడిన కిలాడీ లేడీల ఉదంతమిది. గురువారం జరిగిన ఈ మోసంపై శుక్రవారం వైరా పోలీసులు కేసు నమోదుచేశారు. వివరాలిలా ఉన్నాయి. వైరాలోని మధిర రోడ్డులో రఘు ఎలక్ట్రీకల్ షాపు ఉంది. ఆషాపు యజమాని భార్య ఒంటరిగా ఉండటాన్ని చూసి ఇద్దరు కిలాడీ మహిళలు అక్కడకు చేరుకున్నారు. మొదట తన మెడలోని చైన్ కాజేసేందుకు ఆ మహిళలు ప్రయత్నిస్తున్నారనే అనుమానంతో ఆమె భర్తకు ఫోన్ చేశారు. వెంటనే కిలాడీ మహిళలు ఆప్రయత్నాన్ని విరమించుకొని తాము కరెంట్ మోటార్ కొనుగోలు చేసేందుకు వచ్చామని మాటలు కలిపి పోలీస్‌స్టేషన్ పక్కనే బ్యూటీపార్లర్ నడుపుతున్నామని చెప్పి తమకు కావల్సిన మోటారును తీసుకొని ఆటోలో పెట్టి ఫోన్‌పే ద్వారా డబ్బు చెల్లిస్తామని ఆమెను నమ్మించారు. ఫోన్‌పే ద్వారా డబ్బు చెల్లించినట్లు హడావుడి చేసి ఆతర్వాత అక్కడి నుంచి ఉడాయించారు. వెంటనే షాపు నుంచి ఆమె భర్తకు ఫోన్‌చేసి ఫోన్‌పే ద్వారా రూ.6500 డబ్బులు వచ్చాయా అని ప్రశ్నించగా తనకు ఎలాంటి సొమ్ము రాలేదని ఆయన స్పష్టం చేశారు. దాంతో సీసీ పుటేజీ ఆధారంగా కిలాడీ మహిళలపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చెరువులో మత్స్యకారుడు గల్లంతు

ఖమ్మం క్రైం జనవరి 5: చెరువులో మత్స్యకారుడు గల్లంతైన సంఘటన ఖమ్మం నగర శివారు కొత్తగూడెంలో గురువారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం ధంసలాపురం పెద్ద చెరువులో రాత్రి కాపలాకు నలుగురు వెళ్ళారు. వీరిలో 43 ఏళ్ళ పిట్టల కనకయ్య, చిన్న వేలాద్రి కలిసి పడవలో చెరువులో తనిఖీకి వెళ్ళారు. గడతో పడవ నెడుతున్న కనకయ్య ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. దీంతో పడవలో ఉన్న వేలాద్రి తన ఫోనుతో మిగిలిన వారికి సమాచారం అందించాడు. వారంతా కలిసి గాలింపు చేపట్టనా ఫలితంలేకపోయింది. మత్స్యకారులు అందించిన సమాచారంలో అధికారులు రెస్క్యూటీంని ఏర్పాటు చేశారు. అయినా శుక్రవారం రాత్రి వరకు కనకయ్య ఆచూకీ లభించలేదు. కనకయ్యకు భార్య, కుమారుడు కుమార్తె ఉన్నారు.

గ్రూప్ 1, 2, 3, 4

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 5: బీసీ సంక్షేమ శాఖ, బీసీ స్టడీ సర్కిల్-ఖమ్మం ఆధ్వర్యంలో గ్రూప్ 1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు స్టడీసర్కిట్ డైరెక్టర్ జీ శ్రీలత తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ డిగ్రి పాసైన అభ్యర్థులు గ్రూప్ 1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణకు దరఖాస్తులు చేసుకోవలెనని తెలిపారు. అరు లైన అభ్యర్థులు ఈ నెల 8 నుంచి 20వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

గురుకుల ప్రవేశ పరీక్ష దరఖాస్తులకు నేడు ఆఖరు

వైరా, జనవరి 5: 2024-25 విద్యాసంవత్సరానికిగానూ వైరాలోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఐదోతరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ కేవీ.రత్నమాల సూచిం చారు. అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.వంద చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. దరఖాస్తుకు శనివారం చివరిరోజు అన్నారు. ప్రస్తు తం నాల్గోతరగతి చదువుతున్న విద్యార్థులు ఐదోతర గతి ప్రవేశానికి అర్హులని, ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు.

ఆర్మీ స్పోర్ట్స్ కంపెనీలో ప్రవేశాలకు ఎంపికలు

చుంచుపల్లి, జనవరి 5: ఆర్మీ స్పోర్ట్స్ కంపెనీలో ప్రవేశాలకు ఓపెన్ ఎంపికలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ఎం.పరంధామరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్మీ స్పోర్ట్స్ కంపెనీ మద్రాస్ ఇంజనీర్ గ్రూప్ అండ్ సెంటర్ బెంగుళూరు వారు 5వ తేదీ నుండి ఫిబ్రవరి 8వ తేదీ వరకు ఆల్ ఇండియా ఓపెన్ సెలెక్షన్ ట్రైల్స్ విభాగాలలో (బాక్సింగ్, హాకీ, స్విమ్మింగ్) నిర్వహించడం జరుగుతుందని, ఈ పోటీలను కేంద్రియ విద్యాలయం మద్రాస్ ఇంజనీర్ గ్రూప్ అండ్ సెంటర్ స్పోర్ట్స్ గ్రౌండ్ బెంగుళూర్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆసక్తి గల క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాల్గొనే వారు 8 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాలు లోపు వారై ఉండాలని, 8వ తరగతి పాసై ఉండాలని తెలిపారు.

సమగ్ర సమాచారం తెలిసేలా చార్టులు ఏర్పాటు చేయాలి

- ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్


గదులను పరిశీలిస్తున్న పీవో

భద్రాచలం, జనవరి 5: ఐటీడీఏ కార్యాలయానికి వచ్చే గిరిజన ప్రజలకు, ప్రజాప్రతినిధులకు కార్యాలయంలో అన్ని శాఖల సమాచారం తెలిసేలా చార్టులు ఏర్పాటు చేయాలని ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన సమావేశ మందిరం మొదలుకొని రెండో అంతస్తులోని విభాగాలను పీవో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే గిరిజనులకు వారికి అవసరమైన శాఖ ఎక్కడ ఉన్నది తెలుసుకోవాలంటే శాఖల వారీగా ఆంగ్ల అల్ఫాబెట్ ప్రకారం సీరియల్ నెంబరు మార్కింగ్ ఏర్పాటు చేయాలని, దానికి సంబంధించిన బోర్డు కార్యాలయం ఎదురుగా ప్రజలకు అందుబాటులో ఉంచాలని అన్నారు. ఐటీడీఏ కార్యాలయంపైన నిర్మాణంలో ఉన్న హాలును త్వరగా పూర్తి చేసి ఏదైనా కార్యాలయంలోని విభాగాలకు ఉపయోగించుకోవడానికి వీలుగా సిద్ధం చేయాలన్నారు. పనికి రాని స్క్రాప్‌ని పది రోజుల్లో పూర్తిస్థాయిలో తొలగించేవిధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్ రాజు, ఎస్వో సురేష్‌బాబు, ఈఈ తానాజీ, ఏడీ అగ్రికల్చర్ భాస్కర్, అశోక్‌కుమార్, డీటీఆర్‌వోఎఫ్‌ఆర్ శ్రీనివాస్, టీఏ శ్రీనివాస్, మేనేజరు ఆదినారాయణ పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ ఉద్యోగి


మొబైల్ అందజేస్తున్న దృశ్యం

సత్తుపల్లి, జనవరి 5: బస్సులో పోగొట్టుకున్న రూ.50వేల విలువైన మొబైల్‌ను బాధిత ప్రయాణీకుడికి అప్పగించిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. దమ్మపేట మండలం నాగుపల్లికి చెందిన పొల్కంపల్లి కవిత హైదరాబాద్ నుంచి రాజదాని ఏసీ బస్సులో వస్తూ సత్తుపల్లి బస్టాండ్‌లో దిగుతున్న సమయంలో మొబైల్ పోగొట్టుకోగా ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా బస్సులో గ్యారెజీ లోపలికి వస్తున్న సమయంలో ఆర్టీసీ విజిలెన్స్ కానిస్టేబుల్ నరేష్ సీటు మీద మొబైల్‌ను గమనించి సమాచారం అందజేశారు. బాధిత ప్రయాణీకురాలికి డిపో ఉద్యోగులైన ఏడీసీలు పీవీ.రావు, జీ.బాలస్వామిల సమక్షంలో అందజేశారు. మొబైల్ అప్పగించిన బాధిత ప్రయాణీ కురాలు ధన్యవాదాలు తెలపగా ఉద్యోగులు, ప్రయాణీ కులు నరేష్‌ను అభినందించారు.

బెల్ట్‌షాపులను వెంటనే రద్దు చేయాలి

ఖమ్మంకార్పొరేషన్,జనవరి5:ప్రజలను తాగుబోతులుగా చేస్తూ, వారి కుటుంబాలను సర్వనాశనం చేస్తున్న మద్యం బెల్ట్‌షాపులను వెంటనే రద్దు చేయాలని, లేకుంటే ప్రత్యక్ష ఆందోళన చేపడతామని ప్రగతిశీల మహిళాసంఘం (పీఓడబ్ల్యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. శిరోమణి పేర్కొన్నారు. శుక్రవారం ఎన్నెస్పీ క్యాంప్‌లోని రామనర్సయ్య విజ్ఞానకేంద్రంలో పీవోడబ్ల్యు జిల్లాకార్యవర్గ సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు గోకినపల్లి సుజాత అధ్యక్షతను జరిగిన సమావేశంలో శిరోమణి మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతున్నదని, యువకులనుండి పెద్దవయసు వారి వరకు మద్యం సేవించి అన్ని రకాలుగా కుటుంబాలతో గొడవలు పడుతున్నారన్నారు. సమావేశంలో పీవోడబ్ల్యు జిల్లా కార్యదర్శి ఆవుల మంగతాయి. సహాయ కార్యదర్శి ప్రతాపనేని శోభారాణి, నేతలు గోకినేపల్లి సరోజినీ,వసుమతి, వెంకట నర్సమ్మ, పరిమళ,స్వాతి,లలిత తదితరులు పాల్గొన్నారు.


ఖమ్మం మునిసిపల్ కార్యాలయంలో బారులుతీరిన ప్రజలు


వైరా మండలం తాటిపూడిలో దరఖాస్తు ప్రక్రియ

పదండి పోదాం..
దరఖాస్తులు ఇద్దాం

ఆరు గ్యారెంటీలను అమలు చేయడానికి ప్రభుత్వం దరఖాస్తులను తీసుకుంటుండగా, స్వీకరణ కేంద్రాల వద్ద రద్దీ కనిపిస్తోంది. శనివారంతో దరఖాస్తు చేసుకోవడానికి గడువు ముగుస్తుండటంతో శుక్రవారం ఇరు జిల్లాల్లో ప్రజలు భారీ సంఖ్యలో దరఖాస్తులను సమర్పించారు.


తిరుమలాయపాలెంలో...


జూలూరుపాడు మండలం వెంగన్నపాలెంలో దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో విద్యాలత

రైతు వేదికలకు 'టెక్' దన్ను

- వీడియో కాన్ఫరెన్సు కేంద్రాలుగా ఉన్నతీకరణ
- నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఎంపిక
- ఉమ్మడి జిల్లాల్లో పది కేంద్రాల పరిశీలన
- కసరత్తు చేస్తున్న ప్రభుత్వం

ఖమ్మం వ్యవసాయం/ కొత్తగూడెం, జనవరి 5: రైతుల కోసం ప్రభుత్వం ఏదో ఒక కార్యక్రమం చేస్తూనే ఉంది. కాలానుగుణంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా అధిక దిగుబడులు సాధించేలా ప్రోత్సహించనుంది. ఈ క్రమంలో గత ప్రభుత్వం రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన రైతు వేదికలనే కేంద్రంగా చేసుకోవాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో నియోజకవర్గానికో రైతు వేదికను వీడియో కాన్ఫరెన్స్‌కు కేంద్రంగా మార్చేందుకు కసరత్తు ప్రారంభించింది.

ఎక్కడెక్కడంటే..

ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల్లో పది నియోజకవర్గాలకు గానూ పదిరైతు వేదికలను వీడియో కాన్ఫరెన్స్‌కు అనుకూలంగా అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఖమ్మం జిల్లాలో ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పినపాక నియోజకవర్గంలో బూర్గంపాడు, భద్రాచలం నియోజకవర్గంలో చర్ల, కొత్తగూడెం నియోజక వర్గంలో లక్ష్మీదేవిపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గంలో ముల్కలపల్లి, ఇల్లెందు నియోజకవర్గంలో టేకులపల్లి మండలంలోని కోయగూడెం రైతువేదికలను వీడియో కాన్ఫరెన్సుకు అనువైన రైతు వేదికలను గుర్తించే పనిలో అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ క్రమంలో అవసరమైన సామగ్రిని సమకూర్చేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ప్రస్తుతం మంగళ, శుక్రవారాల్లో రైతు వేదికల్లో ఏఈవోల ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



ఇకముందు వీటిని నిపుణులైన వ్యవసాయ శాస్త్రవేత్తలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చేపట్టనున్నారు. దీనివల్ల రైతులకు పంటల సాగు విధానం, సస్యరక్షణ చర్యలు, తెగుళ్లు, వాటి నివారణ చర్యలు నేరుగా తెలియజేయవచ్చు. ప్రభుత్వం అందించనున్న రైతు భరోసా, రైతుబీమా, పంట రుణాలకు సంబంధించిన ఎలాంటి సందేహానికైనా పరిష్కా ర మార్గాలను సులువుగా తెలియజేసే వీలుంది. నకిలీల బెడద నివారణ, రాయితీ ఎరువులు, విత్తనాల పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.

ఐదు వేల హెక్టార్లకు ఒకటి..

రైతు వేదికలను వీడియో కాన్ఫరెన్సు కేంద్రాలుగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల వ్యవసాయ అధికారులకు ఇటీవల ఆదేశించింది. ఇరు జిల్లాల్లో నియోజకవర్గాల వారీగా రైతులందరికీ సౌకర్యంగా ఉండే వేదికను ప్రతిపాదించాలని సూచించింది. నెట్‌వర్క్, సరిపడా స్థలం ఉండాలని పేర్కొంది. అన్నదాతల సౌకర్యం, సమాచార మార్పిడి, పంట పరికరాలు, ఉత్పత్తులకు సంబంధించి రైతు వేదికలు నిర్మించాలని 2017లో అప్పటి ప్రభుత్వం భావించింది. 2020లో నిర్మాణాలు పూర్తి చేసింది. జిల్లాలో ఐదు వేల హెక్టార్లకో రైతు వేదిక నిర్మించారు. క్లస్టర్ల వారీగా ఒక్కో క్లస్టర్‌కు 10గుంటల నుంచి అర ఎకరం స్థలాన్ని గుర్తించారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 129, భద్రాద్రి జిల్లాలో 67 రైతు వేదికలను నిర్మించగా ఏఈవోల ఆధ్వర్యంలో నిర్వహి స్తున్నారు. ఒక్కో వేదికకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల నుంచి రూ.8 లక్షలు, వ్యవసాయ శాఖ నుంచి రూ.12 లక్షలను కేటాయించగా ఒక హాల్, రెండు గదులతో 2,046 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించారు.

బహుళ ప్రయోజనం

ఏ రైతూ పట్టణాలకు వెళ్లకుండా సమీప ప్రాంతంలోనే అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలన్నది రైతు వేదికల లక్ష్యం. ఏఈవో కార్యాలయం అందులోనే ఉండగా ప్రభుత్వ పథకాలు నేరుగా చేరుతున్నాయి. అన్నదాతలకు పంటల సాగు విధానంపై శిక్షణనిస్తున్నారు. ఆధునిక సాగు పద్ధతులు, చీడపీడల నివారణ, మేలు రకమైన విత్తనాల ఎంపిక, తయారీ, సాగులో మెలకువలతో అధిక దిగుబడులు సాధించడం, గిట్టుబాటు ధరలు పొందేలా వ్యవసాయ శాఖ, అనుబంధ విభాగాల నుంచి ఎప్పటికప్పుడు సూచనలు అందిస్తున్నారు. రైతు సమావేశ మందిరాలుగా, గోడౌన్లుగా, విత్తన, ఎరువులు, ధాన్యం నిల్వ కేంద్రాలుగా వినియోగించాలని నిర్ణయించారు.

భద్రాద్రిలో ముగిసిన విలాసోత్సవాలు

- వశిష్ట మండపంలో రామయ్యకు ప్రత్యేక పూజలు

భద్రాచలం, జనవరి 5: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విలాసోత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. ఈ నెల 3వ తేదీన విలాసోత్సవాలు ప్రారంభం కాగా మూడు రోజుల పాటు నిర్వహించారు. చివరి రోజైన శుక్రవారం దేవస్థానం ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వంద గదుల సత్రం ప్రాంగణంలోని వశిష్ట మండపంలో స్వామి వారికి విలాసోత్సవం నిర్వహించారు. ముందుగా స్వామి వారిని అందంగా అలంకరించి పల్లకీలో మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ బాణసంచా కాల్చుతూ వశిష్ట మండపానికి తీసుకొచ్చారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారికి ప్రసాద నివేదన చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ఏఈవోలు శ్రవణ్ కుమార్, భవానీరామకృష్ణారావు, ఇంజనీరింగు ఈఈ రవీంద్రనాథ్, పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్, నిరంజన్‌కుమార్, లింగాల సాయిబాబా, దేవస్థానం ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరావు, అనిల్ కుమార్ పాల్గొన్నారు.


పూజాదికాలు నిర్వహిస్తున్న వైదికులు

రామయ్యకు నేడు రాజఖడ్గ సమర్పణ

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి శనివారం కర్ణాటక రాష్ట్రానికి చెందిన మధ్వాచార్య మూలమహాసంస్థానం ఉత్తరాధిమఠాధీశులు సత్యాత్మతీర్థులుచే రాజఖడ్గాన్ని సమర్పించనున్నారు. ముందుగా పవిత్ర గోదావరిలో స్నానం ఆచరించి సంస్థాన పూజ నిర్వహించి భద్రాద్రి రామాలయ సందర్శన అనంతరం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ఉత్తరాధిమఠం స్వాములచే రాజఖడ్గాన్ని సమర్పించనున్నారు.

రామయ్యను దర్శించుకున్న ఇస్రో శాస్త్రవేత్త

భద్రాచలం, జనవరి 5: భద్రాచలం సీతారామచంద్రస్వామిని ఇస్రో శాస్త్రవేత్తలు శుక్రవారం దర్శించుకున్నారు. ఏపీలోని శ్రీహరికోట షార్ స్పేస్ సెంటర్‌కు చెందిన శాస్త్రవేత్త, డిప్యూటీ డైరెక్టర్ ఆర్.సెంథిల్‌కుమార్ భద్రాద్రి రామయ్యను దర్శించుకోగా.. ఆయనకు దేవస్థానం అధికారులు సంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా.. వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు లింగాల రామకృష్ణ ప్రసాద్, వేనూత్నూల ఆంజనేయ వరప్రసాద్ శర్మ, సతీష్‌ధావన్, తదితరులు పాల్గొన్నారు.


రామాలయంలో ఇస్రో డిప్యూటీ డైరెక్టర్ సెంథిల్‌కుమార్

ఇరు జిల్లాల ఓటర్ల సంఖ్య
21,83,235

- ఖమ్మం జిల్లాలో 12,16,796, భద్రాద్రిలో 9,66,439 మంది
- పార్లమెంట్ ఎన్నికలకు ముసాయిదాకు కసరత్తు
- నేటి నుంచి ఫిబ్రవరి 6 వరకు ఓటుహక్కు, ఫిర్యాదుల నమోదు
- 8వ తేదీన తుదిజాబితా విడుదల

ఖమ్మం కలెక్టరేట్/ కొత్తగూడెం, జనవరి 5: ఖమ్మం జిల్లాలో 12,16,6796మంది ఓటర్లతో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 9,66,439మంది ఓటర్లతో ఇరు జిల్లాల అధికారులు ముసాయిదా జాబితాను శనివారం ప్రకటించనున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోసం ఇరు జిల్లాల ఎన్నికల అధికారులు వీపీ గౌతమ్, ప్రియాంక అలా ముసాయిదా జాబితాను నేడు ప్రకటించనున్నారు. ఈ నేపథ్యంలో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో తహసీల్దారు కార్యాలయాల్లో ఓటర్ల జాబితాను ప్రదర్శనకు పెట్టనున్నారు. ఈ జాబితాలో పేర్లు లేని వారు జనవరి 6 నుంచి ఫిబ్రవరి 6 వరకు 18 ఏళ్లునిండే వారు కూడా ఓటరుగా నమోదుకు దరఖాస్తులను స్వీకరించనున్నారు.

20,21 తేదీల్లో ప్రత్యేక కార్యక్రమం

నేటి నుంచి ఫిబ్రవరి 2 వరకు దరఖాస్తులను స్వీకరించి ఆ తర్వాత వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలన తర్వాత తుదిజాబితాను ప్రకటించనున్నారు. దీనికోసం ఇరు జిల్లాల వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈనెల 20,21 తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఎన్నికల అధికారులు నిర్వహిస్తున్నారు. ఆరోజుల్లో బీఎల్వోలు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండి దరఖాస్తులను స్వీకరిస్తారు. తుది జాబితాను ఫిబ్రవరి 8న ప్రకటించనున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కొత్త ఓటర్లను నమోదు చేయడంతో పాటు రెండు చోట్ల నమోదయిన ఓటర్లను తొలగించారు. వలసలు, మృతిచెందిన వారి ఓటర్లను తొలగించి తాజాగా ఓటర్లతో తుది జాబితాను సిద్ధం చేసి నవంబరు 11న ప్రకటించారు.

ఖమ్మం జిల్లాలో 1,456 పోలింగ్ కేంద్రాలు

ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల్లో మొత్తం 1,456 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఖమ్మం నియోజకవర్గంలో 355, పాలేరులో 289, మధిరలో 268, వైరాలో 252, సత్తుపల్లిలో 292 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుత ముసాయిదా జాబితాప్రకారం ఖమ్మం జిల్లాలో 12లక్షల16వేల 796 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 5లక్షల 89వేల 165 మంది, 6లక్షల 27వేల 553 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఇతరులుగా 78 మంది ఉన్నారు. ఖమ్మం నియోజకవర్గంలో 3లక్షల 22,వేల 996 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 1,54,978 , మహిళలు 1,67969 మంది ఇతరులు 49 మంది ఉన్నారు. పాలేరు నియోజకవర్గంలో మెత్తం ఓటర్లు 2,36,287 మంది కాగా పురుషులు 1,14,134 మంది, మహిళలు1,22,148మంది ఉన్నారు. ఇతరులు 5మంది ఉన్నారు. మధిరలో మొత్తం ఓటర్లు 2,21,326 ఉండగా పురుషులు 1,07,111, మహిళా



ఓటర్లు 1,14,206 ఇతరులు తొమ్మిది మంది ఉన్నారు. వైరా నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 1,93,069 మంది ఉండగా వీరిలో పురుషులు 94,057 మంది, మహిళలు 99,005 మంది ఇతరులు ఏడుగురు ఉన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,43,118 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,18,885ఉన్నారు. మహిళలు 1,24,225 మంది కాగా ఇతరులు ఎనిమిది మంది ఉన్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోలింగ్ కేంద్రాలు 1,095

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా 1,095 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. జిల్లాలో మొత్తం ఓటర్లు 9,66,439మంది ఉండగా, వారిలో పురుష ఓటర్లు 4,71,745 మంది, మహిళా ఓటర్లు 4,94,650 మంది, ఇతరులు 44 మంది ఉన్నారు. పినపాకలో మొత్తం ఓటర్లు 1,98,402 మంది ఉండగా వారిలో పురుషులు 97,821, మహిళలు 1,00,577 మంది, ఇతరులు నలుగురు ఉన్నారు. ఇల్లెందులో మొత్తం ఓటర్లు 2,19,569 మంది కాగా అందులో పురుషులు 1,07,909 మంది, మహిళలు 1,11,658 మంది, ఇతరులు ఇద్దరు ఉన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,43,846 మంది ఉండగా వారిలోపురుషులు 1,18,385 మంది, మహిళలు 1,25,434 మంది, ఇతరులు 27 మంది ఉన్నారు. అశ్వారావుపేటలో మొత్తం ఓటర్లు 1,55,961 మంది ఉండగా అందులో పురుషులు 76,193మంది, మహిళలు 79,761 మంది, ఇతరులు ఏడుగురు ఉన్నారు. భద్రాచలం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 1,48,661 మంది ఉండగా పురుషులు 71,437 మంది, మహిళలు 77, 220మంది ఇతరులు నలుగురు ఉన్నారు.

తిరువూరులో చంద్రబాబు
బహిరంగ సభకు తరలాలి

- టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు వాసిరెడ్డి

ఖమ్మం మామిళ్లగూడెం, జనవరి 5: ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో ఈనెల 7వ తేదీన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పాల్గొనే రా.. కదిలిరా అనే బహిరంగ సభకు ఖమ్మం పార్లమెంట్ జిల్లా నియోజకర్గం నుంచి టీడీపీ కార్యకర్తలు అభిమానులు పెద్దసంఖ్యలో తరలిరావాలని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం కోరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి పార్టీ శ్రేణులు బహిరంగ సభకు తరలిరావాలని ఆయన కోరారు.

నేడు, రేపు డిప్యూటీ సీఎం
భట్టి విక్రమార్క పర్యటన

మధిర, జనవరి 5: రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క 6, 7తేదీల్లో జిల్లాలోని మధిర నియోజకవర్గంలో పర్యటించనున్నా రు. 6వతేదీ శనివారం ఉదయం హైదరాబాద్‌లోని ప్రజాభవన్ నుంచి ప్రారంభమై 10.30 గంటలకు మధిర నియోజకవర్గంలోని ఎర్రుపాలెం మండలం చేరుకుంటారు. ఉదయం 11గంటలనుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మిషన్ భగీరథ పథకంపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఎర్రుపాలెం నుంచి బయలుదేరి 3.00గంటలకు మధిర చేరుకొని రెడ్డి గార్డెన్స్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే పౌరసన్మానం కార్యక్రమంలో పాల్గొంటారు. శనివారం రాత్రి మధిర క్యాంపు ఆఫీసులోనే బస చేస్తారు. ఆదివారం ఉదయం 10గంటలకు మధిర నుంచి బయలుదేరి 11.45గంటలకు వైరా మండలంలోని తన స్వగ్రామం స్నానాల లక్ష్మీపురం చేరుకుంటారు. అక్కడ జరిగే సన్మాన కార్యక్రమాల్లో పాల్గొని సాయంత్రం 3గంటలకు ఖమ్మం మీదుగా హైదరాబాద్ తిరిగి వెళ్లారు. ఈమేరకు డిప్యూటీ సీఎం ఆఫీస్ అధికారులు, కాంగ్రెస్‌పార్టీ శుక్రవారం ప్రకటించారు.




'బహిరంగ విసర్జన' రహిత నగరంగా ఖమ్మం

ఖమ్మం కార్పొరేషన్, జనవరి5: బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత నగరంగా ఖమ్మం నగరపాలకసంస్థ ఎంపికైంది. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో ఓడీఎఫ్++ కేటగిరిలో ఖమ్మాన్ని చేర్చినట్లు శుక్రవారం ప్రకటించింది. నగరంలో 45 పబ్లిక్ టాయిలెట్లు ఉండగా, కేంద్రం నుంచి వచ్చిన సర్వేబృందం 33 టాయ్‌లెట్లను పరిశీలించింది. ఓడీఎఫ్++ హోదా వల్ల ఖమ్మం నగరపాలకసంస్థకు 750 మార్కులు కలుస్తాయి. స్వచ్ఛసర్వేక్షణ్‌లో గతంలో 150వ స్థానంలో ఉన్న ఖమ్మం ప్రస్తుతం ఓడీఎఫ్ ప్లస్‌ప్లస్ కేటగిరీ పొందటంతో 60 లేదా 70 స్థానంలోకి వస్తుంది. అంతేకాకుండా మధిరకు ఓడీఎఫ్, వైరాకు ఓడీఎఫ్+, ఇల్లెందుకు ఓడీఎఫ్++ గుర్తింపు లభించింది.

ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



ఖమ్మం

ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి

8

శనివారం 6 జనవరి 2024

17 నుంచి మహిళలకు ఉచిత శిక్షణ ప్రారంభం

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి5: నగరంలోని టేకులపల్లి మహిళా ప్రాంగణంలో ఈ నెల 17నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. నిరుపేద యువతకు పలు రంగాలలో ఈ శిక్షణను అందిస్తున్నట్లు జిల్లా మహిళా ప్రాంగణాధికారిని వేల్పులు విజేత తెలిపారు. అందులో భాగంగా 13 నుంచి 21 సంవత్సరాల మధ్య వయసు కలిగిన బాలికలకు ఉచిత భోజన, వసతి సదుపాయాలతో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 17 నుంచి వివిధ రకాల శిక్షణా తరగతులు ప్రారింబిస్తున్నట్లు తెలిపారు. టైలరింగ్, కంప్యూటర్ తదితర వాటిల్లో శిక్షణ పొందుటకు ఆసక్తి కలిగిన విద్యార్థినులు వెంటనే జిల్లా మహిళా ప్రాంగణం టేకులపల్లి ఖమ్మంలో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా జిల్లా మహిళా ప్రాంగణ అధికారి తెలిపారు. ఆధార్ కార్డు, కులధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, విద్యాఅర్హత సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు, ఒక ఫోటోతో మహిళా ప్రాంగణమునలో దరఖాస్తులు అందించాలని తెలిపారు. దరఖాస్తుకు ఈనెల 10 చివరి తేదీ అన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుకు నేటితో ఆఖరు

- అర్హులందరికీ ప్రభుత్వ పథకాల అమలు
- కలెక్టర్ గౌతమ్



ఖమ్మంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంకార్పొరేషన్, జనవరి5: ప్రజాపాలన దరఖాస్తులకు శనివారంతో చివరిరోజని అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ వీపీ. గౌతమ్ పేర్కొన్నారు..శుక్రవారం కలెక్టర్ ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తు స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన కేంద్రాలకు వచ్చే ప్రతీ దరఖాస్తును తీసుకోవాలని, దరఖాస్తులను తిరస్కరిం చడానికి వీలులేదన్నారు. అనంతరం ప్రజాపాలన కార్యక్రమానికి వచ్చిన ప్రజలతో కలెక్టర్ మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ గ్యారెంటీ పథకాలకు దరఖాస్తు చేసుకుంటున్న వివరాలను అడిగీ తెలుసుకున్నారు. గ్యారంటీ పథకాలతో పాటు ఏ ఇతర అంశంపై ప్రజలు అధికంగా దరఖాస్తు సమర్పిస్తున్నారనే అంశాన్ని కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్వీకరణ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్కులలో దరఖాస్తులను నింపడంలో ఏవైన సందేహాలుంటే నివృత్తి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, అధికారులు పాల్గొన్నారు.

అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి
నియోజకవర్గ ప్రత్యేకాధికారి శ్రీరాం

నేలకొండపల్లి: సభల్లో పాల్గొనే అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి కొండపల్లి శ్రీరాం అన్నారు. శుక్రవారం నేలకొండపల్లిలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో శ్రీరాం పాల్గొన్నారు మూడుచోట్ల మొత్తం 30 కౌంటర్లు ఏర్పాటు చేశారు. 2478దరఖాస్తులు అందాయి. చెర్వుమాధారంలో జరిగిన ప్రజాపాలన సభలో మండల ప్రత్యేకాధికారి రమణ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జమలారెడ్డి సర్పంచ్ రాయపూడి నవీన్, ఈవూరి సుజాత, ఎంపీటీసీ బోడ్డు బొందయ్య, ఎంపీఓ శివ, ఏఈఓ భవాని, కార్యదర్శి దేవేందర్ పాల్గొన్నారు.

పథకాలకు లంచాలు అడిగితే సహించేది లేదు

వేంసూరు: ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాలకు లంచాలు అడిగితే సహించేది ఎమ్మెల్యే మట్టా రాగమయి హెచ్చరించారు. శుక్రవారం వేంసూరులో జరిగిన అభయ హస్తం ప్రజాపాలన గ్రామసభలో పాల్గొని ప్రసంగించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని, ఎవరూ ఎటువంటి లంచాలు ఇవ్వొద్దన్నారు. ఇక నుంచి అలా వసూలు చేస్తే సహించేదే లేదని హెచ్చరించారు. ప్రభుత్వ పథకాలు పేదలకు అందించడమే కాంగ్రెస్ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, సర్పంచ్‌లు ఎండీ. ఫైజుద్దీన్, మేడా వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు కాసర చంద్రశేఖర్‌రెడ్డి, వెల్ది జగన్మోహన్‌రావు, కుక్కపల్లి శ్రీనివాసరావు, ఎర్రా సత్యనారాయణ, దొమ్మనబోయిన వెంకటేశ్వరరావు, నీలం బాబూరావు, పుల్లారావు, తక్కెళ్లపాటి గోపాలకృష్ణ, దుగ్గిరాల అశోక్, వసంతరావు, ట్రాన్స్‌కో ఏఈ అంకారావు ఉపాధి పాల్గొన్నారు.

మధిరటౌన్: మధిర8,9,22, వార్డుల్లో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో మధిర మునిసిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు 70 ప్రాంతాల్లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

ఖమ్మంకలెక్టరేట్: ప్రజాపాలన ఎనిమిదోరోజు శనివారం జిల్లాలో 21 మండలాల్లో నాలుగు మునిసిపాలిటీల్లో 70ప్రదేశాల్లో గ్రామసభలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఖమ్మం నగరంలో ఉదయం 4వ డివిజన్ రాజీవ్ నగర్‌గుట్ట, పాండురంగా పురం, 12వ డివిజన్ నేతాజీ నగర్, పోలీస్ హౌజింగ్ కాలనీ, 30వ డివిజన్ పంపింగ్‌వెల్‌రోడ్డు, 31వ డివిజన్ జహీర్‌పుర, 45వ డివిజన్ మామిళ్లగూడెం, 50వడివిజన్ బురహాన్‌పురం, మామిళ్లగూడెం, 60వడివిజన్ రామన్నపేటలో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మధ్యాహ్నం 2గంటల నుంచి కూడా ఇవే ప్రాంతాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, కమిషనర్ రమాదేవి, కౌన్సిలర్లు మల్లాది సవిత, మల్లాది వాసు, కట్టా గాంధీ, వై.వి.అప్పారావు పాల్గొన్నారు.

ప్రజలు ఇబ్బందులు పడకుండా పత్యేక ఏర్పాట్లు

కొణిజర్ల: మండలంలోని కొణిజర్ల, తనికెళ్ల గ్రామాల్లో శుక్రవారం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా 17 కౌంటర్లను ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హుస్సేన్, ఎంపీడీవో మహాలక్ష్మీ, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైరా: వైరా మండలం, మునిసిపాలిటీల్లో శుక్రవారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ఎంపీవో జ్యోత్స్న దేవి ఆధ్వర్యంలో తాటిపూడిలో ఎంపీడీవో డి.కరుణాకర్‌రెడ్డి, తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలోని టీంలు వైరా 13,14,15,16వార్డుల్లో ప్రజాపాలన నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

తప్పులు దొర్లకుండా ఆన్‌లైన్ చేయాలి

డేటా ఎంట్రీ ఆపరేటర్లతో కలెక్టర్ గౌతమ్



డేటా ఎంట్రీపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్



సూచనలిస్తున్న ఆర్డీవో అశోకచక్రవర్తి

ఖమ్మంకలెక్టరేట్, జనవరి5: ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా ప్రజాపాలన దరఖాస్తులను కట్టుదిట్టంగా, పొరబాట్లు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ భక్తరామదాసు కళాక్షేత్రంలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్‌లో నమోదు చేసే అంశంపై డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులను డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆన్‌లైన్ ప్రజాపాలన వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వంపై నమ్మకంతో ప్రజలు ఈ కార్యక్రమానికి వచ్చి దరఖాస్తులను అందించారని అర్హులైన ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు ఆ దరఖాస్తులు ఆన్‌లైన్ చేయడం కీలకమన్నారు. ప్రజాపాలన వెబ్‌సైట్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్లకు లాగిన్ అందిస్తామని మండలాల్లో అవసరమైనమేర కంప్యూటర్లు వేగవంతం మైన ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. జనవరి 17లోగా పూర్తి చేయా లన్నారు. సంక్రాంతి లోపుకే వీటి ఆన్‌లైన్ చేయాలని కలెక్టర్ డేటా ఎంట్రీ ఆపరేటర్లకు సూచించారు. ఆన్‌లైన్ ప్రక్రియ సూచించిన కేంద్రాలు, ఎంపీడీవో, తహసీల్దారు మునిసిపల్ కార్యాలయాలు దగ్గర మాత్రమే చేపట్టాలన్నారు. పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు వారి సమక్షంలోనే ఆన్‌లైన్ చేయాలన్నారు. సందేహాలు ఉంటే వారితో నివృత్తి చేసుకోవాలన్నారు. దరఖాస్తుల్లో ఉన్న వివరాలు నమోదు చేయాలని యూజర్ ఐడీ లాగిన్‌లు గోప్యంగా ఉంచాలని ఇతరులకు ఇవ్వవద్దని ఆయన తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వింజం వెంకట అప్పారావు, డీఆర్డీవో విద్యాచందన, డీపీవో హరికిషన్, ఈడీఎం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సత్తుపల్లిలో పరిశీలించిన ఆర్డీవో అశోకచక్రవర్తి

సత్తుపల్లి: అభయహస్తం దరఖాస్తును బాధ్యతాయుతంగా తీసుకుని తప్పులు దొర్లకుండా డేటా ఎంట్రీ చేయాలని కల్లూరు ఆర్డీవో ఎస్.అశోకచక్రవర్తి సూచించారు. శుక్రవారంరాత్రి మునిసిపల్ కార్యాలయంలో డేటీ ఎంట్రీ ప్రక్రియను స్పెషల్ ఆఫీసర్ సునీల్‌రెడ్డితో కలిసి పర్యవేక్షించారు. డేటా ఎంట్రీ పూర్తయిన తర్వాత దరఖాస్తుదారుడి మొబైల్ నెంబర్‌కు సమాచారం చేరుతుందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ కే.సుజాత, ఏఈ సురేష్, మేనేజర్ శ్రీనివాసరావు, ఏవో స్వప్న, డీటీ శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్‌కు సర్వంసిద్ధం

వైరా: వైరా మునిసిపాలిటీలో ఇప్పటివరకు ఆయా వార్డుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. వైరా మండలం అలాగే మునిసిపాలిటీలోని మొత్తం 42 గ్రామసభల ద్వారా ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించ నున్నారు. శనివారంతో ఈ ప్రజాపాలన కార్యక్రమం ముగుస్తుంది. వైరా మండల ప్రత్యేక అధికారి కస్తాల సత్యనారాయణ పర్యవేక్షణలో వైరా మునిసిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ అయిన ఎంపీడీవో డి.కరుణాకర్‌రెడ్డి, తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, ఎంపీవో జ్యోత్స్నదేవి టీంలీడర్లుగా ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. శుక్రవారం వరకు 18వేల దరఖాస్తులు వచ్చాయి.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ గౌతమ్

ఖమ్మంకార్పొరేషన్, జనవరి5: రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వీపీ. గౌతమ్ ఆదేశించారు.. శుక్రవారం ఖమ్మం నగరపాలకసంస్థ సమావేశపు మందిరంలో ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్‌హెల్త్, ఇరిగేషన్, విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 4మున్సిపాలిటీలు, 589 గ్రామాల నివాస ప్రాంతాలలోని జనాభా ఎంత, జనాభాకు సరిపోయేంత నీరు లభ్యతపై సమీక్షించారు. ఖమ్మంకార్పొరేషన్ పరిధిలో అమృత్ పథకంలో 18 ఇఎల్‌ఎస్‌ఆర్ ల నిర్మాణం చేపట్టి 16 నిర్మాణాలు పూర్తిచేసుకుని, వాడుకలోకి తెచ్చామన్నారు. మిగతా 2నిర్మాణాలు వారంలోపు పూర్తి చేసి, అందుబాటులోకి తేవాలన్నారు. 685 కిలోమీటర్ల మేర పైప్ లైన్ ఏర్పాటు పూర్తి చేశామన్నారు.. సత్తుపల్లి మునిసిపాలిటీలో ఒక ఇఎల్‌ఎస్‌ఆర్, 27.42 కిలోమీటర్ల పైప్ లైన్ పనులు మంజూరు చేసుకొని, 93 శాతం మేర పనులు పూర్తిఅయ్యాయని, మిగులు పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మధిరలో 104.01 కిలోమీటర్ల పైప్ లైన్, 5నిర్మాణాలు మంజూరు చేసుకొని, 91 శాతం పనులు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. గత అనుభవాల దృష్టిలో పెట్టుకొని, సమస్యాత్మక ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో ఖమ్మం నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, పబ్లిక్ హెల్త్ ఎస్ఇ రంజిత్, మిషన్ భగీరథ ఎస్ఇ సదా శివకుమార్, ఈఈలు పుష్పలత, వాణిశ్రీ, ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వరరావు, మునిసిపల్, విద్యుత్, ఇరిగేషన్, ఇంజనీరింగ్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యాల్లో పాల్గొన మాజీ ఎమ్మెల్యే సండ్ర

కల్లూరు, జనవరి5: కల్లూరులో పలు శుభకార్యాల్లో సత్తుపల్లి మాజీఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పాల్గొన్నారు. స్థానికంగా కట్టా అర్లప్పగృహ ప్రవేశ శుభకార్యానికి హాజరయ్యారు. జీడీపీపల్లిలో జరిగిన ఓ వివాహ రిసెప్షన్‌లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించి శుభకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలెపు రామారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ కాటంనేని వెంకటేశ్వర రావు, డీసీసీబీ డైరెక్టర్ గొర్ల సంజీవరెడ్డి, బోబోలు లక్ష్మణరావు, నాయకులు మోదుగు పుల్లారావు, పెడకంటి రామకృష్ణ కోఆప్షన్ సభ్యుడు ఎస్ కే కమ్లి సర్పంచు రావి సూర్యనారయణ కొరకొప్పు ప్రసాద్ పాల్గొన్నారు.

పేకాట స్థావరం పై పోలీసుల దాడి

కల్లూరు, జనవరి5: మండలంలోని చెన్నూరులో పేకాట స్థావరంపై శుక్రవారం స్థానిక పోలీసులు దాడి చేశారు. రూ.40 వేలు స్వాధీనం చేసుకుని, ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి రఘు తెలిపారు.

కల్లూరులో బైక్ చోరీ

కల్లూరు,జనవరి5: కల్లూరులోని మధిర రహదారి వైపున గల ఓ గృహం ముందు ఉంచిన బైక్ చోరీ జరిగింది. స్థానికంగా మధిర రహదారి వైపునకు చెందిన తుంగ రాంబాబు ఇంటి ఎదుట పల్సర్ బైక్ పార్క్ చేశాడు. కాగా దొంగలు అపహరించకుని పోయినట్లు బైక్ యాజమాని రాంబాబు చెప్పాడు. ఆయన ఫిర్యాదుతో ఎస్ఐ పి.రఘు కేసు నమోదు చేశారు.

ఘనంగా అయోధ్య అక్షింతల శోభాయాత్ర



ఖమ్మం ఖానాపురంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మంసాంస్కృతికం,జనవరి5: అయోధ్య రాముడి అక్షింతల శోభాయాత్ర శుక్రవారం ఇండస్ట్రియల్ ఏరియా బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లో ఘనంగా నిర్వహిం చారు. సీతారామలక్ష్మణుల విగ్రహాలను ఊరేగించటంతో పాటు భక్తులు కోలాటాలతో కోలాహలంగా కార్యక్రమం నిర్వహించారు. బీజేపీనేత అల్లిక అంజయ్య ఆధ్వర్యంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇంటింటికి అక్షింతలను, కరపత్రాలను పంచారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొల్లి కొమరయ్య, ప్రధాన కార్యదర్శి తిరపతయ్య, గౌరవ సహాదారులు పల్లెబోయిన చంద్రయ్య, కార్పోరేటర్ దండా జ్యోతిరెడ్డి, జమితి జిల్లా బాధ్యులు అల్లిక అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాతర్లపాడులో ..

చింతకాని: మండల పరిధిలోని పాతర్లపాడులో శుక్రవారం అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు.గ్రామస్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కాండ్ర పిచ్చయ్య, హిందూపరిషత్ సభ్యులు తాటికొండ రామకృష్ణ, తెలుకుంట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

తెల్దారుపల్లిలో వైభవంగా శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ



ఖమ్మంరూరల్, జనవరి5: మండల పరిధిలోని తెల్దారుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణుడి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం వైభవంగా ప్రతిష్ఠించారు. ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. మూడురోజులుగా ప్రత్యేక పూజలతో గ్రామం అంతా సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా గ్రామస్తులందరికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో కార్పొరేట్ శక్తులను తిప్పికొట్టారు

- సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి
- రేజర్లలో రూ.46లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రేజర్లలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిరూరల్, జనవరి5: కార్పోరేట్ శక్తులను కాదని ధనబలంతో ముందుకు వచ్చిన వారి ప్రయత్నాలను తిప్పికొట్టిన ప్రజాబలం గొప్పదని, మీరు ఓటు వేసి బాధ్యత నెరవేర్చుకోగా ఇక నుంచి మీ బాధ్యత నాదేనని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రేజర్లలో సుమారు రూ.46లక్షల అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. మమ్మల్ని, మా కుటుంబాన్ని మీ ఇంటి ఆడబిడ్డగా ఆదరించి అఖండ మెజార్టీతో గెలిపిం చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆరోజు ఎన్నికల సమయంలో చేసిన వాగ్ధానాలను తూచా తప్పకుండా మనస్ఫూర్తిగా నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. ఉమ్మడిజిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఏ అభివృద్ధి అయినా సత్తుపల్లి నుంచే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. అనుక్షణం తనను గెలిపించేందుకు కృషిచేసిన ప్రతీ కార్యకర్తను మరువనని స్పష్టంచేశారు. రేజర్లలో సత్తెమ్మ కాలనీ, పాత ఎన్టీఆర్ కాలువను పూడ్చి గ్రామంలో ఇల్లులేని నిరుపేదలకు ఇళ్లను కేటాయిస్తామన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో కొద్దిరోజుల్లోనే మట్టి రోడ్లు లేకుండా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అధికారం వస్తే అహంకారం పెరగదని, బాధ్యతలు పెరుగుతాయని, మీ ఆదరాభిమానం నియోజకవర్గంలో ఇలాగే కొనసాగాలన్నారు. అంతకముందు సత్తుపల్లి మునిసిపాలిటీలోని 19వవార్డు, రేజర్లలోని ప్రజాపాలన గ్రామసభలను సందర్శించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

కిషన్‌రెడ్డి చొరవ పట్ల హర్షం

ముదిగొండ, జనవరి5: ముదిగొండలో హైవే రహదారి నిర్మాణంలో భాగంగా రైతులు పొలాలకు వెళ్లేందుకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హైవే అధికారులతో మాట్లాడారు. జాతీయ రహదారి నుంచి పొలాలకు వెళ్లేందుకు దారి వెసులుబాటు కల్పించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ రైతులకు స్వీట్లు పంపిణీ చేశారు. రహదారి సౌకర్యం కల్పించినందుకు మంత్రి కిషన్‌రెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, రైతులు రావులపాటి స్వరాజ్, ముత్తయ్య, ఉపేంద్రరావు, శ్రీనివాసరావు, వెంకయ్య, భద్రయ్య, రవి, నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.

సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో వనభోజనాలు

సత్తుపల్లి,జనవరి5: సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో శుక్రవారం సామూహిక వనభోజనాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం యు.రాజ్యలక్ష్మీ మాట్లాడుతూ యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వనభోజనాల సందర్భంగా 150మంది ఉద్యోగులకు మొదటి విడతగా ఆటలపోటీలు సాగాయన్నారు. మహిళలకు బెలూన్ ఫిల్లింగ్, లెమన్ స్పూన్, కుర్చీ ఆట, పాటలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించగా కబడ్డీ, పరుగు పందాలలో పురుషులు పోటీపడ్డారు. గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ, ఎంఎఫ్ సాహితి, ఏడీసీలు, ఉద్యోగులు పాల్గొన్నారు.



బహుమతులు అందిస్తున్న డీఎం రాజ్యలక్ష్మీ

ఆ భూములే మా జీవనాధారం

- గోద్రేజ్ కంపెనీకి ఇవ్వలేం
- మంత్రి తుమ్మలకు రైతుల వినతి



మంత్రి తుమ్మలకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

కొణిజర్ల, జనవరి5: మండలంలోని గుబ్బగుర్తి రెవెన్యూ పరిధిలో నిర్మిస్తామంటున్న గోద్రెజ్ పామాయిల్ ఫ్యాక్టరీకి తమ భూములు ఇవ్వమని సంబంధిత పట్టాదారు రైతులు శుక్రవారం మంత్రి తుమ్మలకు కలిసి వినతిపత్రం అందజేశారు. పామాయిల్ ఫ్యాక్టరీ కోసం అసైన్‌మెంట్ భూమి కాకుండా తమ పట్టాలు భూములు ఇవ్వాలని కంపెనీ వారు కోరుతున్నారని వివరించారు. మాజీవనాధారం ఆ భూములేనని తమ భూములు ఇవ్వమని న్యాయం చేయాలని మంత్రికి వివరించారు. గతంలో తహసీల్దార్ గ్రామసభ పెట్టినప్పుడు కూడా భూములు ఇవ్వమని చెప్పామని తుమ్మలకు రైతులు వి. మా భూముల జోలికిరాకుండ చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామంలో సుమారు 20మంది రైతులు పాల్గొన్నారు.

కేజీబీవీ, సమగ్ర శిక్ష, ఎయిడెడ్ ఉద్యోగుల వేతనాలు చెల్లించాలి

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి5: కేజీబీవీ, సమగ్రశిక్ష, ఎయిడెడ్ ఉద్యోగుల, ఉపాధ్యాయుల నవంబర్, డిసెంబరు వేతనాలు వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.వి. నాగమల్లేశ్వరరావు పారుపల్లి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. పండుగల సందర్భంలో వేతనాలు రాక పలువురు ఉద్యోగ, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థులు గణితంపట్ల ఆసక్తి కలిగి ఉండాలి: డీఈవో

ఖమ్మంరూరల్, జనవరి5: విద్యార్థులు గణితంపట్ల ఆసక్తి కలిగి ఉండాలని డీఈఓ సోమశేఖరశర్మ పేర్కొన్నారు. మండల పరిధిలోని గోళ్లపాడు, పోలేపల్లి ఉన్నత పాఠశాలలో గణిత నైపుణ్య ప్రదర్శనను శుక్రవారం నిర్వహించారు. పదోతరగతిలో వందశాతం ఉత్తీర్ణతపై దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన గణిత ప్రదర్శనను తిలకించారు. గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ గురించి ఆయన శాస్త్రానికి చేసిన కృషిని వివరించారు.

పొలంలో పాదముద్రలు



నేలకొండపల్లి, జనవరి5: మధుకాన్ షుగర్స్ ఫ్యాక్టరీ సమీపంలో మండ్రాజుపల్లి కొత్తూరు గ్రామానికి చెందిన కిలారు ప్రసాద్ పొలంలో వింత అడుగులు కనపడ్డాయి. పెద్దపెద్ద అడుగులు కావటంతో అవి ఏజంతువు అడుగులో అర్థం గావటం లేదని రైతు ప్రసాద్ అన్నారు.

సహకార బ్యాంక్ డైరెక్టర్ శ్రీనివాసరావుకు నివాళి

ఖమ్మం వ్యవసాయం, జనవరి 5: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ డైరెక్టర్ వేముల శ్రీనివాసరావు గత నెల 24న గుండెపోటుతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లా కేంద్రసహకార బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షుడు కూరాకుల నాగభూషయ్య, పాలకవర్గ సభ్యులు అధికారులు సిబ్బంది వేముల శ్రీనివాసరావు చిత్రపటానికి నివాళులర్పించారు.

గంగమ్మ తల్లి ఆలయానికి శంకుస్థాపన

ఖమ్మంరూరల్, జనవరి5:మండల పరిదిలోని గూడురుపాడు నూతనంగా నిర్మిస్తున్న గంగమ్మతల్లి ఆలయానికి శుక్రవారం గ్రామస్తులు శంకుస్థాపన చేశారు. గ్రామస్తులు, భక్తులు భక్తిశ్రద్దలతో ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి5: మహబూబ్‌నగర్ మైనారిటీ గురుకుల బాలురు కళాశాల-2లో ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డ సంఘటనను పురస్కరించుకొని నలుగురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేయటాన్ని నిరసిస్తూ జిల్లాలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల వద్ద ఉపాధ్యాయులు మధ్యాహ్నం భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. విచారణ జరిపి విద్యార్థి మరణానికి కారణం తెలుసుకోవాలని, తదనంతరం మాత్రమే ఉపాధ్యాయుల పొర పాటు ఉంటే చర్యలు తీసుకోవడం సమంజసం అవుతుంది కానీ, ఏ సంఘటన జరిగినా ఉపాధ్యాయులని సస్పెండ్ చేయడం సరికాదన్నారు.

స్వాతంత్ర్య సమరయోధురాలు మృతి



ఎర్రుపాలెం,జనవరి5: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో తల్లపురెడ్డి వెంకటరావమ్మ(92) స్వాతంత్ర్య సమరయోధురాలు అనారోగ్యంతో మృతిచెందారు. వెంకట్రామ్మ మృతిపట్ల పలువురు రాజకీయనాయకులు, రిటైర్డు ఉద్యోగులుఅధికారులు సంతాపం తెలిపారు. ఆమెకు ఐదుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలున్నారు. ఆమె మృతికి పలువురు సంతాపం తెలిపారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ఖమ్మంవ్యవసాయం, జనవరి5: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన పాలకవర్గ సమావేశంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షుడు కూరాకుల నాగభూషయ్య, సీఈఓ రెహమాన్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.